ఆగష్టు - 2016

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక

ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

**చందా వివరములు :**

సంవత్సర చందా రూ. 150/-

పోషక చందా రూ. 1000/-

జీవిత చందా రూ. 3000/-

విడి ప్రతి రూ. 15/-


**మా చిరునామా :**

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28

ఒంగోలు - 523001

ఫోన్ : 08592-231281

సెల్ : 9704255416


## లోపలి పేజీల్లో...


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| బర్నబా | కొడవటికంటి | 03 |
| లియో టాల్‌స్టాయ్ | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 07 |
| బైబిల్ కథలు | మామయ్య కథలు<br>రెవ.డా॥కె.జోసఫ్‌గారు | 10 |
| బైబిలు ప్రాముఖ్యత | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 12 |
| ఏడు సంఘాలు | బ్రదర్ కె. సామ్రాట్‌గారు | 15 |
| జ్ఞానవంతురాలు | శ్రీమతి రేచల్ జోసఫ్ | 17 |
| కులంలో నుండి వెలివేశారు | సాక్ష్యము | 19 |
| పరలోకము అనగానేమి? | రెవ. ఎ. మత్తయి, వినుకొండ | 22 |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | 24 |


India Evangelistic & Relief Fellowship

| EVANGELISM | RELIEF |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelestic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Leprosy Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International | Children Care Ministry |
| Hanna Women Ministries | |

### ప్రకటన రేట్లు

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



ప్రియ పరిశుద్ధత పాఠకులకు ప్రభువు నామమున శుభాభివందనములు.

పత్రిక అభివృద్ధికి తోడ్పడుతున్న మీ అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. గత నెలలో పత్రిక కావాలని సుమారు 100 మంది నుండి అభ్యర్ధనలు వచ్చాయి. పత్రిక ప్రారంభం నుండి ఇప్పటి వరకు అనేకమంది పత్రికను ఉచితంగానే పొందుతున్నారు. అయినప్పటికీ మేము పత్రికను ఎవరికీ ఆపలేదు. అయితే ధరల పెరుగుదలనుబట్టి పత్రిక ఖర్చు పెరుగుతూనే ఉంది. ఈ మధ్యకాలంలో పోస్టల్ చార్జి కూడా 2 రెట్లు పెంచారు. పేపరు మరియు ప్రింటింగ్ చార్జీలు కూడా పెరిగాయి. అయినప్పటికీ పత్రిక చందాను మేము పెంచలేదు. ఈ పరిస్థితుల్లో పత్రిక పొందుతున్న ప్రతి ఒక్కరూ సంవత్సర చందా కట్టటం ద్వారా కొత్త వారికి పంపించగలమని తెలియజేస్తున్నాము. పాఠకులు సహృదయంతో అర్థం చేసుకోగలరని ఆశిస్తున్నాను.

పత్రికలో ప్రచురితమవుతున్న ఆర్టికల్స్ గురించి మీ అభిప్రాయము తెలియజేయమని కోరుతున్నాము. బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా మీరు బైబిలు పూర్తిగా చదువుటకు అవకాశం ఉంటుంది. ఎందుకంటే ప్రతి అధ్యాయము నుండి ఒక ప్రశ్న వుంటుంది కాబట్టి జవాబు కోసం మీరు ఆ అధ్యాయం అంతా చదవాల్సి వుంటుంది. 'దహనబలుల కంటే దేవుని గూర్చిన జ్ఞానము నాకిష్టమైనది' (హోషేయ 6:6) అని దేవుడే చెప్తున్నాడు. కాబట్టి మీరు బైబిలు క్విజ్‌లో పాల్గొనటం ద్వారా దేవుని సంతోషపెట్టగలరు. పత్రిక గురించి, పత్రికలోని శీర్షికలను గురించి మీరు రాసే ప్రతి ఉత్తరమును పత్రికలో ప్రచురిస్తాము. పత్రిక అభివృద్ధికి మీ వంతు బాధ్యత నిర్వహించ గలరని ఆశిస్తున్నాను. దేవుని కృపనుబట్టి 'హోలి బైబిల్ స్కూల్' ప్రారంభించబడినది. పదవ తరగతి చదివిన మీ పిల్లలను చేర్పించాలనుకుంటే మమ్ములను సంప్రదించండి. ప్రభువు కృప ఇప్పుడు, ఎల్లప్పుడును మీకు తోడైయుండును గాక!

-ఎడిటర్

సీరియల్

# బర్నబా

3

**(అపొస్తలుడు రెండవభాగం)**

**- కొడవటికంటి**

మరునాడు షెమయతో కలసి రేవుకు వచ్చారు. సిడ్ని నదిలో బయలు దేరిన ఓడ పదిమైళ్ళ ప్రయాణం చేసిన తర్వాత మధ్యధరా సముద్రంలోనికి ప్రవేశించింది. చాలా సంవత్సరాలు తార్సు కొండలలో గలతీ కొండలలో తిరిగి నీరసించిన సౌలు ఈ ఓడ ప్రయాణం ఊరట కలిగించింది.

విలాసవంతనైన ఓడ కాకపోయినా అన్ని సదుపా యాలతో ప్రయాణం బాగుంది. బర్నబా సౌలు ముఖం వైపు చూస్తూ మరలా "సౌలు, ఈ పది సంవత్సరాలునువ్వు ఒక్కడివే అనేక గ్రామాలు, పట్టణాలు తిరిగి సేవ చేస్తున్నావా? అన్ని చోట్ల యూదులు ఉన్నారా?" అన్నాడు.

సౌలు ఆలోచిస్తూ బర్నబా ముఖంలోకి సూటిగా చూశాడు. తర్వాత లేచి నిల్చున్నాడు, బర్నబా కూడా నిల్చున్నాడు. ఇద్దరు ఓడ పైభాగమునకు వచ్చి అక్కడ ఉన్న రెండు చెక్క పెట్టెల మీద కూర్చున్నారు.

సౌలు గొంతు సరిచేసుకొని –"ఇంతవరకు ఈ సంగ తులు ఎవరితోను పంచుకోలేదు. అయినా వివరంగా చెప్ప లేను, చాలాకాలం క్రితం సిసారియలో మీతో సాగనంపబడి కిలికియ సిరియా దేశములలో సంచరించాను, యూదులకు నా ముఖ పరిచయం లేనందున యెరూషలేము మొదలుకొని చుట్టు ప్రక్కలనున్న ప్రదేశములందు, ఇల్లూరిక ప్రాంతం వరకు క్రీస్తు సువార్తను సంపూర్ణంగా ప్రకటించి యున్నాను. యేసుని గూర్చిన సమాచారం ఎవరికి తెలియపరచబడలేదు. చూడని వారు చూతురనియు వినని వారు గ్రహింతురనియు వ్రాయబడిన ప్రకారము క్రీస్తు నామము ఎరుగని ప్రదేశాలలో సువార్తను ప్రకటింపవలెనని మిక్కిలి ఆశగల వాడనైయుండి ఆలాగున ప్రకటించితిని" అని బర్నబావైపు చూశాడు.

"ఇల్లూరికం అనే ప్రాంతం ఎక్కడుంది?" అడిగాడు బర్నబా.

"ఇది యూరప్‌లో అడ్రియాటిక్ సముద్రపు చుట్టూ ప్రాంతం" అన్నాడు సౌలు.

అంటే దాదాపు ఇటలీ దేశము వరకు సేవ చేస్తారన్న మాట, అయితే అన్యజనులు అంత తేలికగా సువార్తను అంగీకరించరా?"అన్నాడు బర్నబా.

"లేదు, లేదు నా చేదు అనుభవాలు జ్ఞాపకం చేసి కొంటూ చెరసాలలో ఉన్నాను, మితములేని దెబ్బలు తిన్నాను. అనేకమార్లు ప్రాణాపాయంలో ఉన్నాను. ఒకసారి ఓడ పగిలి రాత్రింబవళ్ళు సముద్రంలో ఉన్నాను, అనేక పర్యాయాలు దొంగల వలన ఆపదలోను, ప్రయాణములలో నదులలోను, ఉపవాసముతోను, జాగరణములతోను గడిపాను. అయితే అవన్నీ ఒంటరిగానే ఓర్చుకొనే శక్తి ప్రభువే ఇచ్చాడు" అన్నాడు.

సౌలుతో కలిసి బర్నబా అంతియొకయలోని సంఘంలో ప్రవేశించిన నాట నుండి వేసే ప్రతి అడుగులోను సౌలును గుర్తు పెట్టుకోవలసి వస్తుంది. ఇప్పుడు ఇక్కడ స్థిరపడిన విశ్వాసులందరు పది, పదమూడు సంవత్సరాల క్రితము యెరూషలేములో స్తెఫను హతసాక్షి అయిన తర్వాత, సంఘమునకు శ్రమ వలన అంతియొకయకు వచ్చిన వారే. సౌలు విశ్వాసమునకు సాక్షిగా ఉపదేశకునిగా ప్రయాసపడటం బర్నబా చూస్తున్నాడు. ఒకరోజు సాయంకాలం సిరియాన్ కొండమీద కూర్చున్న బర్నబాకు దూరంలో ఇటుగా నడచివస్తున్న సౌలు, మనయేసు కనిపించారు. వస్తూనే వారు బర్నబా ప్రక్కన కూర్చున్నారు.

"పట్టణంలో జనాభా ఒక్కరోజులో రెండంతలు అయి నట్లుగా ఉందికదా" అన్నాడు.

మనయేసు తన పై పాగాతీసి తలపైన సరిగా కట్టు కుంటూ "ప్రతి సంవత్సరం ఈ నెలలో గుఱ్ఱపు పందాలు

మొదలౌతాయి. వాటితో కలసి నాటకశాల ప్రారంభము అవుతుంది. పట్టణము వ్యాపారము మూడంతలు అవుతుంది. వాయిద్యశాలలు, నాట్యశాలలు, క్రీడాకారులు, సిరియా నుండి నాట్యకారులు, లిబియా నుండి పిల్లనగ్రోవి వాయించే వారు, తూర్పునుండి నర్తకీమణులు, ఎస్కలాన్ దేశము నుండి మల్లవీరులు, గుంజీ నుండి సంగీత గాయకులు, లవొదికయ నుండి హాస్యకారులు ఈ నెల రోజులు ఈ పట్టణం పండుగ చేసికొంటుంది ప్రభువును విశ్వసించక ముందు హేలేదుతో కలసి ఇక్కడికి వస్తుండే వాడిని" అని బర్నబా వైపు చూస్తూ "ఏమిటి ఆలోచిస్తున్నారు?" అన్నాడు.

"వీరందరికీ ప్రభువును గురించి చెప్పటం ఎలా?" అన్నాడు బర్నబా.

సూర్యుడు పడమర దిగుతున్నప్పుడు వందల కొలది గొఱ్ఱెలు గుంపులు గుంపులుగా అంతియొకయ శివార్లలో వీరు కూర్చున్న ప్రదేశమునకు దగ్గరగా ఉండే దొడ్లలో ప్రవేశిస్తున్నాయి. సౌలు వాటిని కాచే కాపరులను చూస్తూ....

"ఈ కాపరులకు యేసు అవసరం లేదా? ఏర్పరచబడిన వారికే క్రీస్తు మర్మం బయలుపరచబడుతుంది" అన్నాడు. క్రీస్తు మర్మం అనే పదం బర్నబాకు, మనయేసుకు క్రొత్తగా అనిపించి తల పైకెత్తి సౌలు ముఖంలోకి చూశారు.

"అవును.....మర్మమైయున్న క్రీస్తు" అన్నాడు సౌలు.

బర్నబా మౌనంగా లేచి నిల్చుని మనయేసు వైపు తిరిగి "నిన్న సమాజ మందిరం దగ్గర శిష్యులకు అచ్చటి యూదులకు జరిగిన అలజడి ఏమిటి?" అన్నాడు బర్నబా.

"అది నాకు సరిగా తెలియదు గాని ఈ ఉదయం అధిపతిగారి కార్యాలయంలో ఒక తాఖీదు విడుదల అయింది. అది ఏమిటంటే యూదులకు క్రీస్తు శిష్యులకు తరచు గొడవలు జరుగుతున్నవి. కనుక క్రైస్తవులు నివసించే చోట బందోబస్తు ఎక్కువ చేయవలెను" అని అన్నాడు మనయేసు.

బర్నబా ఆలోచిస్తూ కైసరుని బలపరచే వారిని కైసరీయులనియు, హేరోదుని వారిని హేరోదీయులనియు క్రీస్తుని వెంబడించే వారిని ఈ రోమా సైనికులు క్రైస్తవులని నమోదు చేస్తున్నారు" అన్నారు.

"క్రీస్తు వారు అనకుండా యేసు వారు అని ఎందుకు పిలవకూడదు" అన్నాడు సౌలు.

"క్రీస్తు అనే పదం ఇటలీ భాషకు దగ్గరలో ఉంటుంది" అని ఆగి ఆలోచించడం మొదలు పెట్టాడు.

సౌలు బర్నబా చేయి పట్టుకొని "క్రైస్తవులు" అని ఆగి "ఇక శిష్యులు అని పిలువబడక క్రైస్తవులు అనే పేరున పిలువబడటం దేవుని చిత్తమై యుండవచ్చును. అదీకాక ఆ క్రైస్తవ్యం అనే పదము యెరూషలేములో ప్రారంభం కాక బర్నబా, సౌలు సేవలో అంతియొకయలో ప్రారంభమైనది.

బర్నబా అంత సంతోషంగా కనిపించలేదు. సౌలు అంతియొకయ రాకముందు తను ఏది ఆలోచించినా, చేసినా యెరూషలేములోని శిష్యులను ముఖ్యంగా, మూలస్తంభము లైన ముగ్గురిని మనసులో ఉంచుకొనేవాడు. శిష్యులను క్రైస్తవులు అని అంతియొకయలోని రోమా సైనికులు నమోదు చేస్తే సంఘములో శిష్యులు కూడా క్రైస్తవులమని చెప్పుకోవటం బర్నబాకి కొంచెం ఆయాసకరంగా ఉంది. ఇక్కడ పరిస్థితులన్ని స్వతంత్రించి ఏ పని చెయ్యటం లేదు. అందువలన ఇందులో సౌలు ప్రమేయం లేదు.

అంతియొకయలో విశ్వసించిన వారందరికి సిలువ వేయబడిన యేసు గురించి తప్ప, పితరులైన అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు, యోసేపుల విషయాలు తెలియవు. వారు సంఘంలో సాక్ష్యమిచ్చేటప్పుడు పరిశుద్ధాత్మ పూర్ణులై మాట్లాడుతుంటే తను ఏమి చెయ్యగలడు? పెంతెకోస్తు అనుభవం పొందిన యూదులతో పోలిస్తే వీరి అనుభవం ఏమి తక్కువగా లేదు.

వాక్యము ప్రకటించటానికి తను సౌలుని తార్సు నుండి తీసికొని వచ్చాడు. ఆయన ఆ పని ఆత్మపూర్ణుడై చేస్తున్నాడు. ఆయన ప్రసంగాలలో సిలువ వేయబడిన యేసు నామం తప్ప ఇక ఏ నామం ప్రకటించబడలేదు. కనుక విశ్వసించిన వారందు యేసును తప్ప యెరూషలేమును ఎరుగరు.

ఒక రోజున యెరూషలేము నుండి ప్రవక్తలు అంతియొకయకు వచ్చారు. వారు కూడా ఇచ్చటి క్రైస్తవుల

విశ్వాసమును చూచి సంతోషించారు కాని సిద్ధాంతములు బోధించలేదు. సబ్బాతు దినము కంటే పునరుత్థాన దినమునకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు.

ఒకనాటి సభ ముగింపులో యెరూషలేము ప్రవక్తలలో ఒకరైన అగబుగారు లేచి నిలబడి గొప్ప శబ్దముతో భూలోకమంతటా గొప్ప కరువు రాబోవుతున్నదని ఆత్మతో చెప్పాడు. ఆ భాష అక్కడ కూడియున్న అన్ని భాషల వారికి అర్థమయింది.

ఆరోజు సాయంకాలం బర్నబా నిగరనబడిన సుమెయోను, కురేనీయుడైన సూకియ, మనయేను, పౌలు, మరికొంత మంది సంఘ పెద్దలు కూడుకొని మాట్లాడుకున్నారు. తీర్మానము ఇలా ఉన్నది.

పెంతెకోస్తు అనుభవం తర్వాత యెరూషలేములోని శిష్యులందరూ తమకు కలిగిన చరాస్థి, స్థిరాస్తి అమ్మి సంఘక్షేమాభివృద్ధికై ఇచ్చినందు వలన మనలో ఇక్కడ ఇప్పుడున్నవారు, శ్రమ కలిగినప్పుడు కుప్ర, ఫినిషియ,అంతియొకయు సంఘముల స్థాపకులైనారు. అయితే దేవుని కృప వలన తల్లి సంఘమైన యెరూషలేములో ఇప్పుడు ఉన్న శిష్యులు అన్ని దేశాలలోని విశ్వాసులకు మార్గదర్శకులైనారు. ప్రభువు బయలుపరచిన రీతిగా సంభవింపబోవు కరువు తల్లి సంఘమును ఆదుకొనవలసిన బాధ్యత మన మీద ఉంచియున్నాడు. కనుక నేడు మన కర్తవ్యమును యోచింపవలసియున్నది. అంతియొకయలో ఉన్న ప్రతి శిష్యుడును తన శక్తి కొలది యూదయలో ఉన్న శిష్యులకు సహాయము బర్నబాకి సౌలును సహాయకునిగా యెరూషలేము పంపుటకు తీర్మానించిరి.

సాలమిలో ఓడ ఎక్కిన బర్నబా, సౌలు ప్రొద్దుపోయిన తర్వాత సిసారియా చేరి గుఱ్ఱపు బగ్గీలో యెరూషలేము ప్రయాణము చేసి బర్నబా అక్క మరియమ్మ గారింటికి చేరేసరికి రాత్రి రెండు గంటలైంది. వరండాలో నిద్రిస్తున్న హేలేదు గుఱ్ఱపు డెక్కల శబ్దమునకు నిద్రలేచి ప్రహరీ గేటు తీసి ముందు బర్నబాను తర్వాత సౌలును ఆలింగనం చేసికొన్నాడు. హేలేదు ఇప్పుడు కొంచెం బలంగా కనబడుతున్నాడు.

"ఎన్ని సంవత్సరాలయ్యింది మనం కలిసికొని" అని అన్నాడు హేలేదు సౌలు భుజాల మీద నుండి ఇంకా చేతులు తియ్యకుండానే. హేలేదు యొక్క ఆత్మీయతకు సౌలు కళ్ళు ఆ చీకటిలో కూడా మెరిశాయి. హేలేదు పనివారిలో ఇద్దరిని నిద్రలేపి నీళ్ళు తోడించి భోజనం ఏర్పాట్లు చేస్తుంటే బర్నబా మార్కుతో కలిసి తన అక్క మరియమ్మ ముఖం వాడిపోయి ఉండటం చూడగా బర్నబా తన అక్క హృదయం దుఃఖముతో నిండియుండిన సంగతి గ్రహించినా నిదానంగా ఆమె చెపుతుందిలే అనుకున్నాడు.

మొదటిసారిగా ఆమె కళ్ళల్లో నీరు బయటకు పొర్లినప్పుడు, మార్కు బర్నబా యొద్దకు వచ్చి "జబది యాకోబు గారిని హేరోదు అగ్రిప్ప ఖడ్గంతో చంపించాడు" అని సన్నగా ఏడ్వడం మొదలు పెట్టాడు. ఆకస్మికంగా విన్న పిడుగులాంటి ఈ వార్త బర్నబాలో ఏ చలనం కలుగచేయలేదు. సౌలు తనే దోషిలాగా సగం సిగ్గుతో, సగం దుఃఖంతో తలవంచుకున్నాడు జబది యాకోబుతో తనకు పరిచయము లేక పోయినా ఆయన యేసు యొక్క ముఖ్యమైన ముగ్గురు శిష్యులలో ఒకడని తెలుసు.

మరియమ్మ తల మీద ముసుకు వేసికొని రోదిస్తున్నది."ఇది యూదులకు ఇష్టమైన కార్యమని తెలుసుకొని పేతురుగారిని కూడా పట్టుకొని చెరసాలలో వేయించాడు".

సౌలు సన్నగా మూలిగాడు. దాదాపు పద్నాలుగు సంవత్సరాల క్రితం తను శిష్యులను చంపించినప్పుడు వారి బంధువులు కూడా ఇలానే రోదించి ఉంటారు అనుకున్నప్పుడు తనకు తెలియకుండానే తన కళ్ళలో నుండి కన్నీరు ఉబికింది. ఇది గమనించిన బర్నబా సౌలు భుజం మీద ప్రేమతో చేయి వేసాడు. తర్వాత చెప్పుమన్నట్లు మార్కువైపు చూశాడు.

"తెల్లవారితే పస్కా పండుగ ముగిసిన మరునాడు పేతురు గారిని ప్రజల ఎదుటకు తీసికొనిరావలెనని యుండగా, దేవుని దూత రాత్రి వేళ ఆయనను చెరసాల నుండి బయటకు తీసికొని వచ్చినది. పేతురుగారు ఆ రాత్రే ఇక్కడికి వచ్చారు" అని చెప్పాడు మార్కు.

"ఇక్కడికా" అన్నాడు బర్నబా.

"ఔను, శిష్యుల సమూహము ఆ రాత్రి ఇక్కడనే పేతురుగారి కొరకు ప్రార్థిస్తున్నారు. ప్రభువు తనను చెరసాలలో నుండి వెలుపలకు ఏలాగు తీసుకొని వచ్చెనో చెప్పి, ప్రభువు తమ్ముడైన యాకోబుగారికి మిగిలిన సహోదరులకు ఈ సంగతి తెలియపరచమని చెప్పి వెళ్ళిపోయారు".

"ఎక్కడికి వెళ్ళారు?" అడిగాడు సౌలు మెల్లగా.

"అదేమో ఎవరికీ తెలియదు. అందువలననే అగ్రిప్ప పేతురుగారి చెరసాలకు కావలియుండిన పదహారుగురు సైనికుల్ని చంపించాడు".

బర్నబా పెద్దగా నిట్టూర్చాడు.

"మహాహేరోదు బాలుడైన యేసును చంప చూచాడు. అతని కొడుకు అంతిపా బాప్తిస్మమిచ్చే యోహానును చంపించాడు. హేరోదులందరు యేసు శత్రువులే".

ఇప్పుడు బర్నబా అక్క కొంచెం ఉపశమనం పొందింది. గొంతు కొంచెం సరిచేసుకొని తన తమ్ముని వైపు, సౌలు వైపు చూసింది."తన కుమారుడు ప్రభువు కొరకు అపొస్తులలో హతసాక్షి అయిన మొదటివాడు అని అతని తల్లి ఏడుస్తుంది. అసలు ఈ పట్టణము ప్రభువు ముందుగా చెప్పినట్లు ఆమె జ్ఞాపకము చేసికొంటుంది" అంది.

బర్నబా ఆశ్చర్యపోయాడు అక్క ముఖంలోకి చూస్తూండి పోయాడు.

సౌలుకు సరిగా అర్థంకాలేదు అనిపిస్తుంది. ఇంతలో హేలేదు వచ్చి అక్కడ కూర్చున్నాడు. మరియమ్మ హేలేదు వైపు చూచి సలోమి విషయం చెప్పు అన్నట్లు చూచింది.

"ప్రభువు ఇంక వారం రోజులలో సిలువ మోయబోతా డనగా జబదయ గారి భార్య సలోమి తన కుమారులతో కలసి యెరికో నుండి యెరూషలేముకు ప్రభువును వెంబడిస్తూ ఊరు దాటి బయటకు వచ్చిన తర్వాత యాకోబును, యోహానును గబగబా నడిపిస్తూ ముందుకు నడుస్తున్న యేసును కలిసికొన్నది. ప్రభువు ఆగినప్పుడు ఆమె నమస్కారం చేసింది. ఆయన 'నీవేమి కోరుచున్నావు?' అని అడిగాడు. అప్పుడు ఆమె 'నీ రాజ్యమందు ఈ నా ఇద్దరు కుమారులను ఒకరు నీ కుడివైపునను, ఒకడు నీ ఎడమవైపునను కూర్చుండ నిమ్మని' అడిగింది. అప్పుడు ప్రభువు ముఖం దుఃఖంతో నిండిపోయింది. ఆయన సలోమి వైపు చూడకుండా ఆమె ఇద్దరు కుమారుల వైపు జాలిగా చూసి 'మీరేమి అడుగు తున్నారో మీకు తెలియదు, నేను త్రాగు గిన్నెలోనిది మీరు త్రాగుటయైనను, నేను పొందుచున్న బాప్తిస్మం పొందుట యైనను మీచేత అగునా?' అని అడిగాడు.'మాచేతనగును' అని వారన్నారు. అప్పుడు ఆయన 'నేను త్రాగుచున్న గిన్నె లోనిది మీరు త్రాగుదురు, నేను పొందుచున్న బాప్తిస్మం మీరు పొందురు' అన్నాడు. కాబట్టి పన్నెండుమంది అపొస్తలులలో మొదటి ఆయన గిన్నెలోనిది త్రాగినవారు యాకోబుగారే కదా!" అన్నాడు హేలేదు.

**(సశేషం)**



## పాఠకులకు గమనిక

**'బైబిలు క్విజ్'**లో పాల్గొనే వారు ప్రతి నెల 30వ తేది లోపల పోస్ట్‌కార్ట్ మీద కాని, ఎన్వలప్ కవర్ ద్వారా కాని పంపించాలి. అన్నీ ప్రశ్నలకు సరైన సమాధానాలు వ్రాసిన వారికి బహుమతి కూడా ఉంటుంది. ప్రతి జవాబుతో బైబిలు రెఫరెన్సు తప్పని సరిగా ఉండాలి. బైబిల్ రెఫరెన్స్ లేని జవాబులు చెల్లవు. మీ జవాబులు పంపాల్సి అడ్రస్ : **పరిశుద్ధత-బైబిల్ క్విజ్, పోస్ట్‌బాక్స్-28, ఒంగోలు**

**- ఎడిటర్**

సీరియల్

# ఇంప్ - లేక - పిల్ల దెయ్యం 28

## (లియో టాల్‌స్టాయ్)

ఓ బీదరైతు తన పొలమును దున్నటానికి ప్రొద్దు పొడవక ముందే తయారయ్యాడు. ఆకలి అయినపుడు తినడానికి కొంచెం రొట్టె గుడ్డలో మూటకట్టాడు. రెండు దున్నలను అరకకు కట్టి పొలంవైపు బయలుదేరాడు. పొలం వచ్చిన తర్వాత తను వేసుకొనిన చొక్కాలో రొట్టె కట్టిన మూటను పెట్టి చొక్కాను గుండ్రంగా చుట్టి ఓ చెట్టు కొమ్మకు తగిలించి పొలం దున్నడం ప్రారంభించాడు. ఓ నాలుగు గంటలు పని చేసిన తర్వాత దున్నలు అలసిపోయాయని తనకు కూడా ఆకలి అవుతున్నందున పని ఆపి పశువులకు నీరు పట్టించి వాటిని చేలగట్ల మీదకు పంపించి మేతకోసం వదిలాడు. తను తన వస్త్రము ఆహారము పెట్టిన చోటికి వచ్చి తన చొక్కాను తీసి చూశాడు. రొట్టెలు కట్టిన మూట కనిపించలేదు చుట్టుప్రక్కలో అంతా వెదికాడు కనిపించ లేదు. తాను పొలం దున్నేటప్పుడు ఎవరూ ఇటు ప్రక్కకి రాలేదు అని నిర్ధారణగా అతనికి తెలుసు. అయితే రొట్టెల మూట మాయమైపోయింది. రైతు ఆశ్చర్యపోయాడు.

నిజానికి ఆ రొట్టెల మూటను ఓ పిల్లదెయ్యం తీసుకెళ్ళి చెట్టుక్రింద కూర్చుని రైతు వైపు చూస్తూ ఉన్నాడు. ఆ రైతు పెద్ద పెద్దగా అరుస్తూ రొట్టెలు దొంగిలించినది ఎవరు? అని బూతులు తిడతాడు అనుకున్నాడు.

కాని ఆ రైతు గట్టిగా నిట్టూర్చాడు. రొట్టెలే కదా పోయినవి, ఒకపూట భోజనం చెయ్యకపోతే నేను చచ్చిపోనులే అనుకున్నాడు.

పాపం ఎవరో ఈ రొట్టెలు తీసుకొనిపోయిన వారు నా కంటే ఎక్కువ ఆకలిగొని ఉండవచ్చును. వారికైనా ఇది మేలు చేస్తుంది అనుకొని లేచి బావి వద్దకు వెళ్ళి కడుపునిండా నీళ్ళు త్రాగి వచ్చిన చెట్టు నీడలో కొంచెంసేపు సేదదీరి లేచి దున్నలను అరకకు కట్టి దున్నటం మొదలు పెట్టాడు.

ఆ రైతు ఏ విధంగా కూడా పాపం చెయ్యకపోవడం వల్ల ఆ పిల్ల దెయ్యం తన యజమానియైన సాతానుతో ఈ సంగతి చెప్పటానికి బయలుదేరాడు. సాతాను దగ్గరకి వెళ్ళి తను ఏ విధంగా రొట్టలు దాచినది చెప్పాడు. ఆ రైతు ఆకలితో వచ్చి రొట్టెలు కనపడకపోతే ఎవరికైనా నా రొట్టెలు మేలు చేస్తున్నాయి అని సమాధానపడ్డాడు అని చెప్పింది.

ఈ మాటలు వినిన సాతాను అగ్గి మీద గుగ్గిలం అయ్యాడు. ఆ రైతుకు నువ్వు కీడు జరిగించలేదు. అతను రొట్టెలు పోయినందుకు బాధపడలేదంటే ఇదంతా నీ తప్పిదమే నీ కర్తవ్యం నీవు సరిగా గుర్తించలేదు. ఆ రైతు లాగనే అతని భార్యపిల్లలు కూడా జీవించనారంభిస్తే ఆ తప్పంతా నీదే అని ఆగి ఆలోచించి, కాబట్టి నువ్వు వెంటనే ఆ రైతు దగ్గరికి వెళ్ళు, అతనిని ఏ విధముగానైనా మనం కోరిన విధంగా నడిపించు నీకు మూడు సంవత్సరాల సమయం ఇస్తున్నాను. ఈ లోపల అతనితో నీ బాధ్యత నెరవేర్చకపోతే నీ తలను పరిశుద్ధ జలంలో ముంచుతాను అన్నాడు.

పిల్లదెయ్య గడగడ వణికిపోయాడు. పరిశుద్ధ జలం తనలాంటి వారికి మృత్యుతుల్యము అనుకొని వేగంగా భూమి మీదకు పరుగెత్తుకుంటూ వచ్చి ఆ రైతు విషయం ఆలోచించి ఆలోచించి... చివరికి ఒక ప్రణాళిక తయారు చేసుకున్నారు. ఇంతకుముందు తను చేసిన పొరపాటు పని ఇక ఎన్నడు చెయ్యకూడదని నిర్ణయించుకున్నాడు. లేచి రైతు ఇంటికి వచ్చాడు. రైతు కూలివలె వేషం వేసుకొని ఆ బీద రైతు దగ్గర కూలి పనికి చేరాడు. మరు సంవత్సరం అక్కడి చిత్తడినేలలో ధాన్యము విత్తమని రైతులకు సలహా ఇచ్చాడు. రైతు అతని సలహా తీసుకొని ఆ చిత్తడి నేలలో వరి విత్తాడు. ఆ సంవత్సరము వర్షాలు పడలేదు. చుట్టు ప్రక్కల ఉన్న పొలాలకు నీరు లేదు. అందువలన వారి వరి పైరు అంతా మాడిపోయింది. కాని పిల్లదెయ్యం వలన

ఈ బీదరైతు పొలం బాగా పండింది. రైతు ఇంటి వారికి సమృద్ధిగా తినడానికే గాక ఇంకా ధాన్యము మిగిలి పోయింది

మరు సంవత్సరం కొండమీద వరిపైరును పండించమని పిల్లదెయ్యం రైతుకు సలహా ఇచ్చాడు. అతని సలహా తీసుకొని కొండ ప్రదేశంలో ధాన్యము చల్లి వ్యవసాయము మొదలుపెట్టాడు. ఆ సంవత్సమంతా వర్షాలు బాగా కురి శాయి. అందువలన మిగిలిన రైతుల పొలాలు అన్నీ నీళ్ళలో మునిగిపోయాయి. కాని ఆ రైతు పొలం కొండమీద ఉన్నం దున సమృద్ధిగా పండింది. ఇప్పుడు తన కుటుంబ ఖర్చు లకు పోగా ఇంగా చాలా పంట మిగిలిపోయింది. ఆ మిగి లిన ధాన్యాన్ని ఏమి చెయ్యాలో రైతుకు తెలియలేదు.

అప్పుడు ఈ పిల్లదెయ్యం నేను త్రాగడానికి మంచి వస్తువును నీ ధాన్యముతో తయారు చేస్తాను అని ఆ ధాన్యము పిండిని పులియపెట్టి స్పిరిట్ తెచ్చి మంచి మత్తు పానీయం తయారుచేశాడు. ఆ రైతు అది త్రాగి సంతోషించి తన స్నేహితులకు కూడా ఇచ్చాడు. అప్పుడు పిల్లదెయ్యం తన యజమానియైన సాతాను వద్దకు వెళ్ళి తను ఇంతకు ముందు చేసిన పొరపాటుకు తీర్పుగా ఇప్పుడు రైతునకు ఏమి చేశానో మీరు ఒకసారి రైతు దగ్గరకు వచ్చి చూడండి అని చెప్పాడు. అప్పుడు సాతాను పిల్లదెయ్యానితో కలసి రైతు ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో రైతు తను ధన వంతుడై తన తోటి రైతులతో కలసి త్రాగుతున్నాడు. అతని భార్య మత్తు పానీయము ఉన్న పళ్ళెంను పట్టుకొని గ్లాసులో వారికి అందిస్తున్నది. ఆమె అలా గ్లాసులో మత్తు పానీయం తీసుకొని వస్తుండగా త్రుల్లి ఓ బల్ల మీదకు ఒరిగిపోయింది. ఒక పాత్రలోని పానీయమంతా దొర్లిపోయాయి.

అప్పుడు రైతు తన భార్యను కోపపడి కుంటిదానా నీ చేతిలో ఉన్నది సూరినీళ్ళనుకున్నావా? కుంటి ముఖందానా అంతమంచి పానీయం నేలమీద ఎలా పడపోశావు? అని బూతులు తిట్టసాగాడు.

అప్పుడు పిల్లదెయ్యం తన మోచేత్తో యజమానికి సైగచేస్తూ, చూశావా! తన ఆహారం పోయినప్పుడు గొణగలేదు. కాని ఇప్పుడు బూతులు తిడుతున్నాడు అన్నాడు.

ఆ రైతు ఇంకా ఆ పానీయం త్రాగుతూ భార్యను తిడుతూ స్నేహితుల మధ్య తిరుగుతూనే ఉన్నాడు. అదే సమయానికి ఒక బీదరైతు పొలం నుంచి ఇంటికి వెళ్తూ రైతు ఆహ్వానము లేకపోయినా లోనికి వచ్చాడు. అతను అక్కడ కూర్చున్న వారందరికి 'హాయ్' చెపుతూ వారి మధ్యలో కూర్చున్నాడు.

తర్వాత వారందరూ త్రాగుతూ ఉండటం చూసి ఇప్పుడు నేను చాలా అలిసిపోయాను. కొంచెం సారా త్రాగితే బాగుండును అనుకున్నాడు. అలానే అందరిని చూస్తూ జొల్లు కార్చుకుంటున్నాడు. ఇంటి యజమానియైన రైతు ఆ బీదరైతుకు సారాయి ఇవ్వకపోగా – నా యింటికి వచ్చే వారందరికి ఇవ్వటానికి సరిపోయే సారాయి నా దగ్గర లేదు అన్నాడు.

ఈ మాటలు సాతానుకు చాలా సంతోషం కలిగిం చాయి. కాని ఆ పిల్లదెయ్యం అప్పుడే సంతోషించ మాకండి జరుగవలసినది ఇంకా చాలా ఉన్నది అని అన్నాడు.

ఇప్పుడు అక్కడ కూర్చున్న ధనవంతులైన రైతులు వారిని త్రాగటానికి ఆహ్వానించిన మన రైతు పనికిమాలిన మాట లన్నీ మాట్లాడుకుంటున్నారు. వారి మాటలన్ని వింటున్న సాతాను పిల్లదెయ్యం వైపు సంతోషంగా చూశాడు. ఈ సారాయి వాళ్ళందరిని పనికిమాలిన మాటలు మాట్లాడే టట్లు చేసింది. ఇంకా వాళ్ళంతా మన చెప్పు చేతులలో ఉండేవారే అన్నాడు సాతాను.

ఇంకా కొంచెం ఓపిక పట్టండి. జరగాల్సింది చాలా ఉంది అన్నాడు. వీరింకా ఒకరికొకరు మోసం చేసుకుంటు న్నారు అన్నాడు సాతాను. వారిని మరొక గ్లాసు త్రాగ నివ్వండి. ఇప్పుడు వారు నక్కల లాగున్నారు కదా! తోకలు ఊపుకుంటూ – ఒకరి వెనకాల ఒకరు తిరుగుతున్నారు. కాని కొంచెంసేపటికి వీళ్ళు ఒకని మీద ఒకరు క్రూరమైన జంతువుల లాగా మారిపోతారు అన్నాడు పిల్లదెయ్యం.

తలా ఒక గ్లాసు త్రాగిన తర్వాత చిన్నగా వారి మాటలు కఠినంగా కర్కశంగా మారిపోయినవి. ఒకరిని చూసి మరొకరు కోపంతో తిట్టుకోసాగారు. అంతలోనే కొందరు తన్నుకోవడం మొదలుపెట్టారు. కొంచెంసేపటికి అందరూ తన్నుకోవడం ప్రారంభించారు. వారితో మన రైతు కూడా

చేయి కలిపాడు. సాతాను ఇదంతా చూసి చాలా సంతోషం చాలా సంతోషం అనడం ప్రారంభించాడు.

ఇదంతా చాలా బాగుంది అన్నాడు సాతాను. ఇంతలోనే కాదండి - ఇంకా ముందు చాలా ఉంది అన్నాడు పిల్ల దెయ్యం. మరలా తలా ఓ గ్లాసు సారాయి తాగారు. ఇప్పుడు వాళ్ళు పెద్ద పెద్దగా అరుస్తున్నారు. ఇప్పుడు ఆహ్వానితు లందరు బయలుదేరారు. కొందరు ఒంటరిగా కొందరు ఇద్దరు ముగ్గురుగా వెళ్తున్నారు. అందరు బయట వీధిలోనికి వచ్చారు. మన రైతు ఏదో పెద్దగా మాట్లాడుతూ బయటికి వచ్చి జారి బోర్లా పడిపోయాడు. అతని ముక్కు వెంబడి రక్తం వస్తుంది. అతని దుస్తులన్నీ తడిసిపోయాయి. అలానే కుక్కలాగా అరవటం మొదలుపెట్టాడు.

ఈ సన్నివేశం చూసి సాతానుడు చాలా సంతోషించాడు. పిల్లదెయ్యాన్ని చూసి - నీవు ముందు చేసిన తప్పిదానికి బదులుగా ఇప్పుడు తయారుచేసిన సారాయి బాగా పని చేస్తుంది. అయితే ఈ సారాను నువ్వు దేనితో తయారు చేశావో నాకు చెప్పు. సారా తయారు చెయ్యంగానే నువ్వు కుక్క నెత్తురు దానిలో కలిపివుంటావు. అందుకనే వీరు ఇలా అరిచారు. తర్వాత తోడేలు నెత్తురు ఆ సారాయిలో కలిపివుండాలి. అందువలన వీరు తోడేళ్ళవలె ఒకరి మీద ఒకరు అరుచుకున్నారు. తర్వాత పంది నెత్తురు కలిపి వుంటావు. అందుకే వీరు పందులలాగా పొర్లుతున్నారు. అన్నాడు సాతాను.

అదేమి కాదు అన్నాడు పిల్లదెయ్యం. ఆ రైతుకు ఎంత ధాన్యం అవసరమో అంతకంటే ఎక్కువ అతనికి నేను సమకూర్చాను. పశు ప్రవర్తన ప్రతి మానవునిలోను నిద్రావస్థలో ఉంటుంది. మనిషి తినడానికి త్రాగడానికి మాత్రం వసతి ఉన్నంతకాలము పశుప్రవృత్తి నిద్రలో ఉంటుంది. అంటువంటి పరిస్థితులలో ఉన్న మన రైతు తన రొట్టెపోయినప్పుడు ఏడవలేదు. కాని తన ఇంటిలో గింజలు భద్రము చేయబడినపుడు అతని పశుప్రవర్తన లేచి నిలబడింది. కనుక తను తినగా మిగిలిపోయిన గింజలతో తన స్వంత ప్రయోజనముతో క్రొత్త క్రొత్త కోర్కెలు తీర్చుకునే ప్రయత్నము చేశారు. అప్పుడు త్రాగుడు నేను అతనికి చూపించాను. దేవుడు అతనికిచ్చిన మంచి గుణ గుణాదులను స్వార్థానికి త్రిప్పినపుడు అంతవరకు తనలో పడిన స్థితిలోవున్న పశుప్రవృత్తి లేచి నిలుచున్నది. అప్పుడు మొదట కుక్కలాగా, తోడేలులాగా చివరిలో పందిలాగా ప్రతిస్పందించాడు. ఇక అతను ఎల్లప్పుడు పశు ప్రవృత్తిలోనే వుంటాడు. అందులోనే జీవిస్తాడు అన్నాడు పిల్లదెయ్యం

అప్పుడు సాతాను ఆ పిల్లదెయ్యాన్ని బహుగా మెచ్చుకొని కొనియాడాడు. పిల్లదెయ్యం ముందు చేసిన తప్పిదాలను క్షమించాడు.

ఆ పిల్లదయ్యానికి పదవీ ఉన్నతి కల్పించాడు.


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, తెలుగు క్రైస్తవ సినిమాలు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు, క్రైస్తవ వివాహ వేదిక, మీ ప్రార్థన అవసరతల కొరకు ప్రార్థనా గది... ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి... www.onlinetelugubible.net**

**www.onlinetelugubible.net**

# బైబిలు కథలు - కయీను, హేబెలు

పిల్లలూ బాగున్నారా? స్కూల్లో పాఠాలు, హోంవర్క్, ఆటపాటలతో చాలా బిజీ ఉన్నారు కదా! మీలో ఎంతమంది ప్రతిరోజూ బైబిల్ చదువుకొని ప్రార్థన చేసుకుంటున్నారు? మనం ఎంత బిజీగా ఉన్నప్పటికీ ప్రతిరోజూ బైబిల్ చదవటం, ప్రార్థన చేసుకోవడం మర్చిపోకూడదు. దేవునికి లోబడి ఉండాలి. దేవుని ఆజ్ఞలు పాటించాలి. దేవుని కాపుదల భద్రత మనకు లేకపోతే సాతాను మనల్ని వశపరచుకొని తన బిడ్డగా చేసుకుంటుంది. మరి సాతాను బిడ్డలు ఎలా ఉంటారో మీకు తెలుసుగా. అలానే కయీను కూడా దేవునికి విధేయతగా ఉండక సాతాను బిడ్డగా మారిపోయి తన సొంత తమ్ముడినే హత్య చేస్తాడు. మరి ఆ కథ ఎంటో తెలుసుకుందామా!




పోయిన నెల కథలో మనం ఆదాము, హవ్వల గురించి తెలుసుకున్నాము కదా! మరి వాళ్ళు దేవుని మాట వినకపోవడం వలన వాళ్ళకి వచ్చిన కష్టాలు, బాధలు వాళ్ళకి వాళ్లు తెచ్చుకున్నవే. వాళ్ళు దేవునికి లోబడి ఉన్నంత కాలం వాళ్ళకి ఎలాంటి కష్టం లేకుండా సుఖవంతమైన జీవితం జీవించారు. ఎప్పుడైతే సాతాను మాట విన్నారో అప్పుడు వాళ్ళు దేవునికి దూరమై పోయి, దేవుడు వారికిచ్చిన ఆధిక్యతలన్నీ పోగొట్టుకొని కష్టాల పాలయ్యారు. దేవుడు వాళ్ళకిచ్చిన ఏదెను తోటలో నుండి బయటకి వెళ్ళగొట్టబడ్డారు. అప్పటి నుండి వాళ్ళకి కష్టాల జీవితం ప్రారంభమయ్యింది.

అప్పుడు ఆదాము హవ్వలకి ఒక కుమారుడు పుడతాడు. అప్పుడు హవ్వ 'దేవుని దయ వలన నేను ఒక మనుష్యుని సంపాదించుకొనియున్నాను' అని అతనికి కయీను అని పేరు పెట్టింది. తరువాత ఇంకొక కుమారుని కని అతనికి హేబెలు అను పేరు పెట్టింది. వాళ్ళు పెరిగి పెద్దవాళ్ళయినప్పుడు కయీను భూమిని సేద్యపరచువాడుగాను, హేబెలు గొర్రెలకాపరి అవుతారు.

కొన్ని రోజులు అయిన తరువాత కయీను తను పండించిన పంటలో కొంత యెహోవాకు అర్పణగా తెస్తాడు. హేబెలు కూడా తన గొర్రెల మందలో తొలిచూలున పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని దేవునికి అర్పణగా తెస్తాడు. అయితే దేవుడు కయీను అర్పణను లక్ష్యపెట్టడు. హేబెలు అర్పణను మాత్రమే తీసుకుంటాడు. ఎందుకంటే కయీను హృదయము దేవునికి నచ్చలేదు. అప్పుడు కయీనుకి చాలా కోపం వచ్చి ముఖం చిన్నబుచ్చుకుంటాడు. అప్పుడు దేవుడు కయీనుతో "నీకు కోపమేల? ముఖము చిన్నబుచ్చుకొని యున్నావేమి? నీవు సత్క్రియ చేసిన యెడల తలెత్తుకొనవా? అని మందలిస్తాడు. అప్పుడు కయీనుకు ఇంకా కోపం ఎక్కువ అవుతుంది. హేబెలు పొలంలో ఉన్నప్పుడు కయీను వెళ్ళి హేబెలుతో మాట్లాడతాడు. అక్కడ కయీను హేబెలును కొట్టి చంపేస్తాడు.

తరువాత దేవుడు కయీనుతో "నీ తమ్ముడైన హేబెలు ఎక్కడ ఉన్నాడు" అని అడిగినప్పుడు కయీను "నాకు తెలియదు, నేనేమన్నా నా తమ్ముడికి కాపలా వాడినా" అని దేవునితో వాదిస్తాడు. అప్పుడు దేవుడు "నీవు చేసిన పని ఏమిటి? నీ తమ్ముని రక్తము యొక్క స్వరము నేలలో నుండి నాకు మొరపెట్టుచున్నది. కాబట్టి నీ తమ్ముని రక్తమును నీ చేతిలో నుండి పుచ్చుకొనుటకు నోరు తెరచిన

యీ నేల మీద ఉండకుండ నీవు శపింపబడిన వాడు. నీవు నేలను సేద్యపరచునప్పుడు అది తన సారమును ఇకమీదట నీకు ఇవ్వదు నీవు భూమి మీద దిగులుపడుచు దేశదిమ్మరివైయుందువు" అని కయీనును శపిస్తాడు దేవుడు. అప్పుడు కయీను "నా దోష శిక్ష నేను భరింప లేనంత గొప్పది. నేడు ఈ ప్రదేశము నుండి నన్ను వెళ్ళ గొట్టితివి. నీ సన్నిధికి రాకుండా వెలివేయబడి దిగులు పడుచు భూమి మీద దేశదిమ్మరినైయుందును. కావున నన్ను కనుగొను వాడెవడో వాడు నన్ను చంపును" అని దేవునితో అంటాడు. అప్పుడు దేవుడు "కాబట్టి ఎవడైనా కయీనును చంపితే వానికి ప్రతిదండన ఏడంతలు కలుగుతుంది" అని చెప్పి కయీనును ఎవరూ గుర్తు పట్టకుండా అతనికి ఒక గుర్తు వేస్తాడు.

అప్పుడు కయీను దేవుని సన్నిధిలో నుండి బయలుదేరి ఏదెనుకు తూర్పు దిక్కున ఉన్న నోదు అనే దేశము కాపురముంటాడు. అక్కడ కయీనుకు ఒక కుమారుడు పుడతాడు. అతనికి హనోకు అని పెట్టి తన కుమారుని పేరు మీద ఒక ఊరు కట్టిస్తాడు.

చూశారా పిల్లలూ కయీను యొక్క దుర్మార్గత, దాని వలన అతనికి వచ్చిన శాపము. దేవుడు కయీనుతో ఏమన్నాడో ఒకసారి చూద్దాం "నీ సత్క్రియ చేసిన యెడల తలనెత్తుకొనవా? సత్క్రియ చేయని యెడల వాకిట పాపము పొంచియుండును. నీ యెడల దానికి వాంఛ కలుగును. నీవు దానిని ఏలుదువు" అని అన్నాడు. అంటే మనం మంచిగా దేవునికి లోబడి ఉండకపోతే పాపము అనగా సాతాను మనల్ని లోబరచుకుంటుంది. అప్పుడు మనం పాపమునకు దాసులమై ఉంటాము. కయీను దేవునికి వ్యతిరేకంగా ఉండటం వలన తన బ్రతుకుతెరువును పోగొట్టుకున్నాడు. దేశదిమ్మరి అయ్యాడు. కాబట్టి మనం దేవునికి లోబడి దేవుని మాట వింటూ మన తల్లిదండ్రులను, అక్కచెల్లెళ్ళను, అన్నదములను, బంధువులను, స్నేహితు లను ప్రేమించటం వలన, పెద్దలను గౌరవించటం ద్వారా మనం ఆశీర్వదించబడతాము. మరి వచ్చె నెలలో మనం 'నోవహు' కథ తెలుసుకుందాము.






**బహుమతి గెలవండి!**

**'పరిశుద్ధత'** మాసపత్రికను ఇతరులకు పరిచయం చేసి వారిని చందాదారులుగా చేర్పించి నట్లయితే మీరు **"పరిశుద్ధ గ్రంథమును"** బహుమతిగా పొందే సదవకాశం లభిస్తుంది. ఈ అవకాశం కేవలం చందాదారులకు మాత్రమే వర్తిస్తుంది. ఐదుగురు చందాదారులను చేర్పించిన వారికి రూ. 200/- విలువ చేసే బైబిలు ఉచితంగా ఇవ్వబడుతుంది. ఒక్కొక్కరికి రూ. 150/- చొప్పున ఐదుగురి చందా రూ. 750/- లు మాకు చేరిన వెంటనే చేర్పించిన వ్యక్తి అడ్రసుకు బైబిలు పంపబడుతుంది. చందా పంపదలచిన వారు మనియార్డరు ద్వారా లేదా మనిట్రాన్స్‌ఫర్ మాకు డబ్బు పంపవలెను.

పాఠకులు ఈ అవకాశాన్ని ఉపయోగించు కొని మీ స్నేహితులు, బంధువులను చందా దారులుగా చేర్పించి **"పరిశుద్ధ గ్రంథమును"** మీ సొంతం చేసుకోండి. పూర్తి వివరాల కొరకు ఈ క్రింది నెంబర్లకు ఫోన్ చేయండి.

**9440217726, 9493950969**



# బైబిలు ప్రాముఖ్యత

**(Importance of the Bible)**

*సేకరణ:* రెవ.డా॥ కె.జోసఫ్

16వ శతాబ్దము ఆరంభము వరకు పశ్చిమ ఐరోపాలోని ప్రజలకు అందుబాటులో ఉండుటకు బైబిల్‌ను వారివారి భాషలలోకి అనువదించారు. ఈ అనువాదము లన్ని లాటిన్ వల్గేటును ఆధారము చేసికొని చేసినవి. అయితే కీర్తనలు, సువార్తలు, పది ఆజ్ఞలు, ముఖ్యమైన కథలు, రక్షణ సువార్త ఇలా కొన్ని భాగలను మాత్రమే అనువదించారు. వీటన్నిటికన్నా జాన్ విక్లిఫ్ (John Wycliffe)చే లాటిన్ వల్గేట్ నుండి 1330-1384లో తర్జుమా చేయబడిన ఇంగ్లీషు బైబిల్ మిన్నగా చెప్పబడినది (Wycliffe's Version). జాన్ విక్లిఫ్ మంచి మేధావియే కాక, మంచి బోధకుడు మరియు సంఘసంస్కర్త కూడా. విక్లిఫ్ చనిపోయిన తర్వాత తన సెక్రటరీ అయిన జాన్ పర్వే (John Purvey) (క్రీ॥శ॥ 1395) అదే ఇంగ్లీషు బైబిలును మరికొంత విపులంగా అనువదించాడు.

1456 సం॥లో మొట్టమొదటిగా లాటిన్ బైబిల్ (Gutenberg Edition) అచ్చు వేయబడినది. తర్వాత పది సం॥లలో హెబ్రీ బైబిల్, గ్రీకు కొత్త నిబంధన మరియు సెప్టూజియంట్ అచ్చు కాబడినవి. ఆ తర్వాత 1522లో మార్టిన్ లూథర్ జర్మనులకు అవసరమని కొత్తనిబంధనను, తర్వాత పాతనిబంధనను అనువదించాడు. విలియం టిండేల్ తన సమయమును, దేవుడు తనకిచ్చిన తలాంతులను తన ప్రజలైన ఇంగ్లాండు వారికై వెచ్చించి అందరికి అర్థమగు ఇంగ్లీషు భాషలోకి మొదట కొత్త నిబంధనను గ్రీకు బైబిలు నుండి తర్జుమా చేసి ముద్రించినాడు. ఈ ముద్రణకు పీటర్ స్కాఫర్ (Peter Schoffer) ఎంతో సహకరించి దాదాపు 6000 కాపీలు ముద్రించాడు. టిండేల్ పాతనిబంధనలోని ఐదు కాండములను, యోనాలను కూడా ఇంగ్లీషులోకి అనువదించి ముద్రించినాడు. యెహోషువ నుండి 2దిన వృత్తాంతముల గ్రంథములను కూడా అనువదించారు కాని తన మరణమునకు ముందు ముద్రించలేకపోయాడు.

టిండేల్ తప్పుడు బోధలు చేయుచున్నాడని అప్పటి సంఘం 17 నెలలు కారాగారములో ఉంచి ఆ తర్వాత 1536 సం॥ అక్టోబర్ 6వ తేదిన గొంతు నులిమి చంపి అతని శరీరమును మంటతో కాల్చివేసెను. తన మరణము నకు ముందే తన స్నేహితుడైన మైల్స్ కవర్‌డేల్ (Miles Coverdale) పూర్తి ఇంగ్లీషు బైబిల్‌ను అచ్చు వేయించెను. అటు తరువాత థామస్ మాథ్యూ (Thomas Matthew) అను టిండేల్స్ స్నేహితుడు ఇదే టిండేల్స్ వర్షన్‌కు కొన్ని మార్పులు చేసి తిరిగి అచ్చు వేయించాడు (1535). ఇదే రోజుల్లో హెన్రీ రాజు చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్‌లోని ప్రతి పారిష్‌లోను ఒక పూర్తి ఇంగ్లీషు బైబిల్ ఉండవలెనని ఆజ్ఞ ఇవ్వగా థామస్ మాథ్యూచే రివైజ్ చేయబడిన టిండేల్ బైబిల్ ఆథరైజ్‌డ్ వర్షన్‌గా ధృవీకరింపబడి ప్రతి పారిష్‌లోను వెలిసినది (1539). దీనినే గ్రేట్ బైబిల్ (Great Bible)గా అభివర్ణించారు.

జెనీవా, స్విర్జర్లాండు, స్కాట్లాండు ప్రాంతములకు తరలి వెళ్ళిన ఇంగ్లీషు వారి కొరకు ప్రింటు చేయబడిన బైబిల్‌ను జెనీవా బైబిల్ (1560) అన్నారు. 1568లో మరియొక బైబిల్ ప్రింటు చేయబడినది. దీనిని బిషప్స్ బైబిల్ (Bishop's Bible) అన్నారు. ఎందుకంటే దీనిని ఆది భాషలైన హెబ్రీ, గ్రీకుల నుండి అనువాదము చేసిన వారిలో కొందరు బిషప్పులు, మిగిలిన వారు తరువాత బిషప్పులైనారు.

ఈ విధంగా Tindale, Coverdale, Great Bible, Geneva Bible మరియు Bishop's Bible అనునవి King James Version అవిర్భవించుటకు కారణమైనవి. 1603లో King James VI Scotland సింహాసనమును అధిరోహించిన తర్వాత సంఘములో అన్ని సమస్యలను చర్చించి, రూపు మాపుటకు ఒక కూడికను ఏర్పాటు చేశాడు. ఆ కూటమిలో క్రొత్త బైబిల్ భాషాంతరమునకై అవసరత ఏర్పడినట్లు గమనించారు. దీని ఫలితముగా 47 మంది పండితులలో ఆరు గ్రూపులుగా విడిపోయి మూడు గ్రూపులు పాతనిబంధనను, రెండు గ్రూపులు క్రొత్తనిబంధనను, ఒక గ్రూపు అపోక్రఫా (ఈ పుస్తకము ఇప్పుడు Protestant Bible లో లేవు) మీదను పని చేసినవి. ఫలితంగా క్రీ॥శ॥ 1611లో King James Version గా మరియొక బైబిల్ ప్రింటు చేయబడినది.

అదే King James Versionను అర్ధంచేసుకొనుటకు మరి కొంత సులభతరం చేస్తూ 130 మంది పండితుల సహాయంతో అందుబాటులో ఉన్న Hebrew, Greek భాషల బైబిల్‌ను, King James Version ను దగ్గర ఉంచుకొని 1982 నాటికి New King James Version గా భాషాంతరము చేసిరి. ప్రపంచములోని ఆంగ్లభాష మాట్లాడు ప్రజల కొరకు అతి సామాన్యమైన మానవులకు అందు బాటులో ఉండుటకు ఇలాంటి మరెన్నో భాషాంతరము చేయబడి ముద్రించబడినవి. Revised Standard Version, New English Bible, Amplified Bible, The Living Bible, The Good News Bible, New American Standard Version, New International Version లాంటివి క్రైస్తవులు విరివిగా వాడుచున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో ఉంది. అయితే మన దేశంలో దాదాపు 18 భాషలు భారత ప్రభుత్వముచే గుర్తింపు గలిగినాయి. దాదాపు 1600 పైగా ఇతర భాషలు మనదేశంలో ఉన్నాయి.

తెలుగు బైబిలు చరిత్ర అను చిన్న పుస్తకములో (బైబిల్ సొసైటి వారిచే ముద్రింపబడినది) పరిశుద్ధ గ్రంథమును తెలుగులోకి అనువదించుట 1712లో మొదలైంది. జిగిన్‌బాగ్ అను మిషనరీ దక్షిణ ఇండియాకు వచ్చి క్రొత్త నిబంధన తర్జుమాను ప్రారంభించాడు. కాని దానినతడు ముగించకుండానే మరణించాడు. ఆ తర్వాత వచ్చిన ఘులి అను మిషనరీ 1719లో ప్రారంభించాడు. ఇతను చాలా భాషలు నేర్చిన పండితుడు. ప్రభువు ప్రార్ధనను ఇతను ఎనిమిది భాషలలోనికి తర్జుమా చేసి తాటాకు పత్రముల మీద వ్రాసి పంచిపెట్టెను. ఈయన బైబిల్‌ను తెలుగు భాషలోనే కాక హిందీ, తమిళ భాషలలోనికి అనువదించుటకు పూనుకొన్నారు. ఈ విధంగా తర్జుమా చేసిన పాతనిబంధన వ్రాత ప్రతులను జర్మనీలోని తన University Libraryకి పంపించాడు. అయితే అక్కడ వారికి భాష తెలియక అశ్రద్ధగా దానిని ఎక్కడో ఉంచినారు. తరువాత ఎంత వాకబు చేసినను దాని విషయమై ఏమి తెలియలేదు. చాలా ఆసక్తికరమైన మరియొక విషయం ఏమిటంటే బైబిల్ సొసైటీ వారు అచ్చు వేయించిన పుస్తకములో కెప్టెన్ దాడ్సు అనే ఆయన ఈస్ట్ ఇండియా కంపెనీలో పని చేస్తుండే వాడు. ఆయన ప్రభువు చేత ప్రేరేపింపబడి దీక్షతో భారతదేశ భాషలు నేర్చుకొని నూతన నిబంధనను తెలుగులోకి తర్జుమా చేయ మొదలు పెట్టాడు. తను ఇంగ్లాండుకు సెలవు మీద వెళ్ళు సమయం వచ్చినప్పుడు, ఆ సెలవులను బైబిల్ తర్జుమాకు వెచ్చింప నిర్ణయించి తన తల్లికి ఒక లేఖ వ్రాశాడు. ఆ లేఖలో "అమ్మా! నేనిప్పుడే సెలవులకు నీ దగ్గరకు రాలేకపోవుచున్నాను. ఎందుకంటే ఈ దేశ సహోదరుల ప్రయోజనార్ధమై నేను పరిశుద్ధ గ్రంథమును వారి భాషలోనికి తర్జుమా చేయుచున్నాను. నన్ను పిచ్చివాడినిగా కొందరు భావించవచ్చు. అయితే నేనింత మంచి పనికి పూనుకొన్నందుకు నీకు సంతోషమే. ఇంకొక ఏడాదిలో నేను పూర్తి తర్జుమా ముగించ గలను. అమ్మా! నేను తలపెట్టిన ఈ కార్యము నెరవేర్చగలుగు నట్లు ప్రార్ధించు. ఈ లోకములో నాకు దీనిని మించినది వేరొకటి లేదు. ఈ కార్యమును తుదముట్టించుటలో నాకు ఏమి సంభవించినను నేను లెక్క చేయను" అంటూ ఒక ఉత్తరం వ్రాశాడు. ఈయన తన చిన్నతనం నుండి సువార్తను ప్రకటించుటలో చాలా ఆసక్తి చూపినందు వలన తన మేనమామ కూడా మెచ్చుకొంటు ఉండేవాడు. తన ఉద్యోగ నిమిత్తం ఇండియా వచ్చే సమయంలో "మహిమ గల

సువార్తను ఇండియా ప్రజలకిచ్చుటకే దేవుడు నిన్ను ఇండియా పంపుటకు నిర్ణయించెను" అని చెప్పేడంట. అయితే డాడ్సు వ్రాసిన ఆ ఉత్తరం తల్లికి చేరక మునుపే డాడ్సు చనిపోయాడు. అతడు చేసిన పని విలువ తెలియక తన తోటి ఉద్యోగులు ఆ వ్రాత ప్రతులను చిత్తు కాగితముల కట్టగా భావించి తగులబెట్టిరి. ఇలా ఇంకా ఎందరో బైబిల్ భాషాంతరమునకు ఎన్నో వ్యయ ప్రయాసలను అనుభవించిరి.

సిరంపూరు మిషనరీలైన విలియంకేరి, మార్ష్‌మాన్, వార్డులను సిరంపూరు త్రిమూర్తులు అంటారు. వారు 1805లో నూతన నిబంధన తర్జుమా మొదలుపెట్టి అంతా సిద్ధంగా ఉన్న సమయంలో 1812లో ముద్రణాలయముకు నిప్పు అంటుకొని వ్రాతప్రతులు, అచ్చులు, కాగితములు అన్ని కాలిపోయాయి. తదుపరి ప్రయత్నంలో నూతన నిబంధన, పాతనిబంధనలోని పంచగ్రంథములను, తెలుగు లోనికి అనువదించి ముద్రించిరి. లండను మిషన్‌కు చెందిన ఇద్దరు మిషనరీలు జార్జిక్రాన్, అగస్టీన్ డిగ్రాంగ్‌లు విశాఖ పట్టణం చేరి తెలుగు అనువాదము మొదలు పెట్టిరి. ఈ పనిలో ఆసక్తి చూపి డిగ్రాంగ్ తన మిషనరీ మిత్రులకు ఉత్తరం వ్రాస్తూ – మిగిలిన పనులన్నింటి కంటే బైబిల్ భాషాంతరము నకే ప్రాధాన్యమియ్యవలెనని వ్రాసియున్నాడు. ఈ భాషాంత రము చేయు పనిలో ఆనంద రాయర్ సహాయము తీసు కొనెను. ఈయన బ్రాహ్మణుల నుండి క్రైస్తవుడాయెను. డిగ్రాంగు గ్రీకు భాషలో నుండి, ఆనందరాయర్ తమిళము నుండి నూతన నిబంధనను తర్జుమా చేసి వారిరువురు చేసిన పనిని సరిచూసుకొని తెలుగు ప్రతిని సిద్ధము చేశారు. డిగ్రాంగ్ ఈ పనిలో అనేక ప్రయాసలు పడుచు తను మరణించు సమయములో చివరి మాటలలో "భాషాంతరము చేయుటకే నేను బ్రతికి యుండనవసరం లేదు. నేను లేకపోయినప్పటికి ప్రభువు ఈ పనిని కొనసాగించును అని పలికెను". అలాగుననే ఆ పని ఆగలేదు. ఆనంద రాయర్, జాన్‌గోర్డన్ అను మరియొక మిషనరీ కలసి తెలుగు నూతన నిబంధనను మద్రాసులో ముద్రించిరి. తరువాత కొన్ని పాత నిబంధన పుస్తకములు కూడా తెలుగులోనికి అచ్చు వేయ బడినవి. 1844లో ఒక సభ ఏర్పాటు చేయబడెను. అప్పటికి వాడుకలో ఉన్న భాషాంతరములను సరిచేసి అందరికి ఆమోదంగా ఉండునట్లు ఒక కూర్పును సిద్ధము చేయుటకు నిర్ణయించి 1857 నాటికి ఒక పూర్తి తెలుగు బైబిల్‌ను సిద్ధము చేసిరి. 1857 లో మొదటిగా పూర్తి పాతనిబంధన తెలుగులో అచ్చు వేయబడినది. (మిషనరీలే కాక మద్రాసులో సివిల్ సర్వీసులో ఉన్న సి.పి.బ్రౌన్ కూడా సొంతంగా బైబిల్‌ను తెలుగులోకి తర్జుమా చేశాడు. ఈ తెలుగు బైబిల్ ప్రతి ఇప్పటికి లండన్ బైబిల్ గృహములో ఉన్నదంటారు. ఈయన గొప్ప పండితుడు. ఆయన తయారు చేసి తెలుగు-ఇంగ్లీషు, ఇంగ్లీషు-తెలుగు నిఘంటువులు ఇప్పటికి వాడుకలో ఉన్నవి). 1865లో మద్రాసు సహాయ సంఘము వారు ఒక కమిటీని నియమించి ఈ బైబిల్ సవరించవలెనను ఉద్దేశ్యముతో జాన్‌హేగారి సహాయముతో 1884లో సరిచేయబడిన బైబిల్ ముద్రించబడినది.


తర్వాత రెవ.డి.అనంతం, బి.సిన్నయ్య, ఇ.లూయిస్, జె.ఆర్.బేకన్‌ల సహాయముతో 1904 సం॥లో ఒకసారి, 1911 సం॥లో మరియొకసారి సవరించబడెను. మొత్తము మీద ఈ బైబిల్ భాషాంతరము అన్ని సంఘముల ఆమోదం పొందెను. ఆ తర్వాత సవరణలు ఏమి జరుగలేదు. అయితే 1913, 1914 సం॥లలో ఏలూరు సమీపంలోని లక్కవరం జమిందారు రాజా భుజంగ రావుగారు నూతన నిబంధన లోని సువార్తలు, రోమా, గలతీ పత్రికలను కావ్యరూపంలో ప్రకటించెను. 1941 సం॥న రెవ.డబ్ల్యు.బాగ్స్ గారిచే తెలుగు రెఫెరెన్సు బైబిల్ ప్రచురింపబడినది.

**(సశేషం)**


**ఇంటర్నెట్‌లో 'పరిశుద్ధత' మాసపత్రిక కొరకు ఈ క్రింది వెబ్‌సైట్ సందర్శించండి**

Read Our Internet Edition @

**www.holinessmagazine.com**



బ్రదర్ కె.సామ్రాట్

# ఏడు సంఘాలు

**పెర్గము సంఘము : (గత సంచిక తరువాయి...)**

**గద్దింపు :** “కావున మారుమనస్సు పొందుము లేని యెడల నేను నీ యొద్దకు త్వరగా వచ్చి నా నోట నుండి వచ్చు ఖడ్గముచేత నీతో యుద్ధము చేతును” (16వ). పెర్గము సంఘానికి ఇది వార్నింగ్. ఇది అబద్ధ బోధకుల్ని, బోధల్ని విసర్జించి, పర్వాలేదు ఇది మంచిదే అనుకుని చేసిన ప్రతి చెడు విషయమై మారుమనస్సు పొందాలి. పాతదాన్ని వదలి క్రొత్తదైన వాక్యానికి చోటివ్వాలి. ఆచారాలతో, అన్య సాంప్రదాయలతో మన చుట్టూ గిరి గీసుకుని ఇదే నాకు క్షేమము అనుకోవడం అవివేకం. దేవుడు ఆశించిన రీతిలో మారుమనస్సు పొందాలి. అలంకార శోభితమైన బోధలు, సంఘ నిబంధనలు, మతాచారాలకు అధిక ప్రాధాన్యత నిచ్చి, ఆ నియమావళినే పట్టుకుని ప్రాకులాడే స్వభావం ఆంతర్యంలోని ఆధ్యాత్మిక దౌర్భల్యానికి, సంఘపు ఆత్మీయ పతనానికి సూచన. అందుకే మనస్సు మార్చుకోవాలి, పెర్గము సంఘంతో పాటు మరో నాలుగు సంఘాలను (ఎఫెసు, తుయతైర, సార్దీస్, లవొదికయ) కూడా మారు మనస్సు పొందమంటున్నాడు. స్ముర్న, ఫిలదెల్ఫియ సంఘాలలో ఏ లోపము కనుగొనందున అవి మారు మనస్సు పొందే అవసరతలేదని మనం గ్రహించాలి.

ఒకవేళ విధేయులగుటకు తిరస్కరిస్తే ఆయన త్వరగా వచ్చి తన నోట ఖడ్గము చేత ఆ అబద్ధ బోధకులకు వ్యతిరేకముగా వారితో పోరాడుతాను అన్నాడు. ఆయన చిత్తానికి విధేయులు కాకుండా సేవా కార్యక్రమాల్లో తలమునకలుగా వుంటూ సేవ చేస్తున్నామని మోసపుచ్చు కొనే ప్రమాదం ఉంది. ఆయన నోట సూత్రాల మేరకు, కఠినంగా, తిరుగుబాటు మనస్సుతో ప్రవర్తిస్తే, ప్రతిఫలంగా అంతే కఠినమైన న్యాయతీర్పు నెదుర్కొనవలసి ఉంటుంది. ఆయన ఎవరితోనైతే ఖడ్గముతో యుద్ధం చేయాలని అనుకుంటున్నాడో వారి విమోచనకై ఎంతో ఆశతో కనిపెట్టి, వారు మనస్సు త్రిప్పుకొని ఆయన్ని వెదకాలని సమయ మిస్తున్నాడు. “దేవుడు ప్రేమామయుడు కాదా? సంఘాన్ని అంత కఠినంగా ఎలా శిక్షించగలడు? అని మీరు ప్రశ్నించ వచ్చు. ఆయన ప్రేమ స్వభావాన్ని సరిగా అర్థం చేసికోక పోవటమే కారణం. ఎంత ప్రేమగల తల్లిదండ్రులయినా, తన కుమారుడు లేక కుమార్తెకు ఉన్న క్యాన్సర్ వ్యాధిని సహించలేరు గదా! అట్లే మనల్ని ప్రేమించి, మన పాపాల నుంచి మనల్ని దూరపరచి, తనతో సమాధానపరచు కోవాలని ఆశిస్తున్నాడు. కావున మారుమనస్సు పొందుము. దేవునితో వైరుధ్యము, దండన, శిక్ష, ఖడ్గమే.

**వాగ్ధానం :** పెర్గము సంఘంలో జయించిన వారికి మూడు (1) మరుగైయున్న మన్నాను భుజింపనిత్తును. (2) తెల్ల రాయి నిస్తాను (3) ఆ రాతి మీద చెక్కబడిన ఒక పేరుండును. అది పొందిన వానికే గాని మరి ఎవనికిని తెలియదు (17వ)

మన్నా ఇవ్వబడునని వాగ్ధానం చేయబడింది. అది భూసంబంధమైన ఆహారం కాదు. పరలోక సంబంధమైనది. అది దేవదూతల ద్వారా సిద్ధపరచబడినది. అరణ్యములో ఇశ్రాయేలీయులకు ప్రభువు అనుగ్రహించిన ఆహారం (నిర్గమ 16:35) మందసములో మన్నాగల బంగారు పాత్ర

వుంది (హెబ్రీ.9:4) అయితే ఇశ్రాయేలీయులు మన్నా గురించి సరిగా యోచించలేదు (సంఖ్యా.11:6). ఈ మన్నా క్రీస్తే అని యోహాను 6:48-50లో చూస్తాము. కొందరికి యింకనూ యీ మన్నా మరుగుగానే వుంచబడింది. తినే వారు తింటూ బలపడుతుంటే, తెలియక కొందరు తికమక పడుతున్నారు. నేటి కల్లోలిత ప్రపంచంలో మన్నాను ప్రజానీకపు దృష్టికి తేవడానికి అనేక సంస్థలు, సేవకులు అవిరళ కృషి చేస్తున్నారు. వాక్యం ప్రకటిస్తున్నారు. దేవుడు తన వాక్యాన్ని మనకు ఆహారంగా యిచ్చాడు. కొందరు ప్రజలు సరిగా యోచింపక, కలుషితమైన మానవ బోధలను అంగీకరిస్తారు. అయితే ప్రభువు ఈ సంఘానికిచ్చే గొప్ప భాగ్యం ఏమంటే, ఇతరులకు తెలియని లోతైన సత్యాలు, మరుగు చేయబడిన మర్మాలు తన వాక్యంలో ఉన్నాయని వాటిని గ్రహించేలా చేస్తానని వాగ్దానం ఇస్తున్నాడు. మీ సంఘం మరుగైన మన్నాను భుజిస్తున్నారా? మీ నాయకులు మర్మాలు బోధిస్తున్నారా? తేటగా ప్రత్యక్షంగా గ్రహించటానికి ప్రార్థించండి.

**తెల్లరాయి :** ఇది కూడా జయించే వారికే. తెలుపు పరిశుద్ధతకు, పవిత్రతకు, పరలోకానికి సంకేతం. ప్రభువు శిరస్సు అతిధవళమైనది (1:14). పరలోకంలో తన వస్త్రాలు తెల్లవే (7:14). పాతనిబంధనలో ప్రధానయాజకుడు ఊరీము, తుమ్మీము ద్వారా దేవుని చిత్తాన్ని తెలుసుకొనేవాడు (సంఖ్యా 27:21). ఈ తెల్లరాయి ద్వారా దేవుని చిత్తం తెలిసికోగలం. ప్రధానయాజకుని న్యాయ విధాన పతకంలో (నిర్గమ.28:30) ఇవి ఉండేవి. హెబ్రీ భాషలో ఊరీము అంటే జ్యోతులని అర్థం. తుమ్మీము అనగా సంపూర్ణత అని అర్థము. వీటిని కేవలం ప్రతిష్ఠితుడైన యాజకుడే ధరించాలి (ఎజ్రా 2:62,63). వాక్యం చదువుట ద్వారా, ప్రార్థన చేయుట ద్వారా మనం దేవుని చిత్తాన్ని తెలుసుకోగలం. మన సంఘాల్లో పరిశుద్ధులై, పవిత్రులై, సాక్ష్యంగలవారై, ప్రార్థన, వాక్యం చదువుట ద్వారా దేవుని చిత్తాన్ని తెలిసికోగల్గుచున్నామా?

ఆ రాతి మీద చెక్కబడిన ఒక క్రొత్త పేరుంటుంది. అది పొందే వానికిని, ప్రభువుకును తప్ప మరెవరికీ తెలియదు. మనలో ప్రతి ఒక్కరం దేవునికి తెలుసు అనటానికి ఇది గుర్తు. పూర్వం విందుకు ఎవరినైనా పిలిస్తే అతని పేరు తెల్లని రాయి మీద చెక్కి మరీ పంపేవారట. నాటి ఆహ్వానాలు అలా ఉండేవి. యిప్పుడు జయించిన వారికైతే "నా ప్రజలు కాని వారికి నా ప్రజలనియు ప్రియురాలు కానిది దానికి ప్రియురాలనియు పేరు పెట్టుదును" (రోమా 9:23). పరలోకంలో ఎందరో ఉంటారు. మనం ప్రభువుకు ఎలా తెలుసు అని అనుకోవచ్చు. కానీ దీనినిబట్టి ప్రభువు ప్రతి దానిని తన స్వంత పేరుతో పిలుస్తాడని తెలిసికోవచ్చు.

**ముగింపు మాటలు:** ప్రియ విశ్వాసీ! ప్రభువు రెండంచులు గల దేవుని వాక్యమనే ఖడ్గంతో ప్రత్యక్షమై నిన్ను హెచ్చరించుచున్నాడు. ఈ పరిస్థితి నేటికి అన్వయించుకుందాం. మనమాయన నామాన్ని ధరించాం. అన్య బోధల్ని ఆచారాల్ని విసర్జించి ప్రభువు పేరుకు తగ్గట్టుగా జీవిద్దాం. నీ జీవితంలోని లోపాల్ని బలహీనతల్ని గురించి కలత చెందక మారుమనస్సు పొందు. ఆలస్యం కాకముందే అంగీకరించండి. లేకపోతే ఖడ్గధారితో తలపడక తప్పదు. నాశనం తథ్యం. హతసాక్షియైన "అంతిప"లా సజీవ సాక్షులుగా జీవించడానికి సహాయం చేయమని పరిశుద్ధాత్మ దేవుణ్ణి అడగండి.

**(సశేషం)**


**గమనిక**

**GNM మరియు B.Sc. Nursingలలో ఖాళీలు కలవు. మీ పిల్లలను చేర్చాలనుకొనే వారు వెంటనే ఈ క్రింది నంబర్లకు ఫోన్ చేసి మీ సీటు రిజర్వ్ చేసుకోండి**

**9676340371, 9704255416**

స్త్రీల విభాగము

# జ్ఞానవంతురాలు



శ్రీమతి కె. రేచల్ జోసఫ్,
హన్నా ఉమెన్స్ ప్రెసిడెంట్

జ్ఞానవంతురాలు తన ఇల్లు కట్టును అని దేవుని వాక్యము చెప్పుచున్నది. జ్ఞానమునకు చెవి యొగ్గి హృదయ పూర్వకముగా తెలివికైమొఱ్ఱ పెట్టి వివేచనకై మనవి చేసి వెండిని వెదకినట్లు వెదకి హృదయమందు భయభక్తులు కలిగి యుంటే ఆయనను గూర్చిన జ్ఞానము నీకు లభించును. ఆయన జ్ఞాన మిచ్చువాడు. పూర్ణ హృదయముతో దేవుని యందు నమ్మకముంచి తన స్వబుద్ధితో నడవక తన ప్రవర్తన అంతటియందు దేవుని చిత్తానికి ఆయన అధికారానికి ఒప్పుకొన్నచో జ్ఞానము సంపాదించుకొందువు. జ్ఞానము సంపాదించి స్త్రీ ధన్యురాలు. జ్ఞానము కలిగిన స్త్రీ ఘనతనా బుద్ధిని దేవునియెడల భయమును సంపాదించుకొనును. జ్ఞానముగల స్త్రీ ఇల్లుకట్టును.

గృహం కట్టుకొనిన స్త్రీ ఎంతో ఓర్పు, సహనం, ప్రార్ధన కల్గి తన కుటుంబాన్ని జీవమార్గంలోకి నడిపించును - జ్ఞానము కలిగిన స్త్రీ ప్రభుని ప్రేమించును జాగ్రత్తగా వెదకి ఆయనను కనుగొని ఆయన చిత్తము లేనిది ఒక్క అడుగైనను ముందుకు వేయదు. తన జీవిత అవసరతలయందు దేవుని వాగ్దానాలను స్వతంత్రించుకొని అనుభవిస్తుంది. దేవుని ప్రేమించి ఒక ఆస్తిపరురాలుగా ఉండి తన విధులను నింపుకొంటుంది. జ్ఞానము గల స్త్రీ మౌనముగా ఉండును. ఇతరులను రక్షించును. జ్ఞానము సంపాదించుకొనుటకు మనము దేవుని మాటలకు లోబడాలి. ప్రార్ధించాలి. వాక్యము చదివి ప్రభువు మాట గైకొనాలి. విశ్వాసమనే డాలు, వాక్యమనే ఖడ్గము, రక్షణ అనే శిరస్త్రాణము ధరించుకోవాలి జ్ఞానముతో ఇల్లు కట్టుకొనేలా చెయ్యి ప్రభువా అని అడుగుచు దేవుని సన్నిధిలో యధార్ధత కలిగి జీవించాలి.

జ్ఞానము కలిగిన స్త్రీ తన బిడ్డల కొరకు రేయి మొదట జామునలేచి నీళ్ళు కుమ్మరించునట్లు తన హృదయాన్ని కుమ్మరించి ప్రార్ధిచును. ఒక్కొక్క బిడ్డ నిమిత్తము ఉపవాస ముండి బిడ్డల నడవడిక గమనిస్తు హెచ్చరించును. తన బిడ్డలను ప్రభువు త్రోవలలో నడిపించును. జ్ఞానము కలిగిన స్త్రీ తన ఇంటి వారి నడతలను బాగుగా కనిపెట్టును. పనిచేయ కుండా భోజనము చేయదు. తన భర్తను ప్రేమించును. ప్రేమతో తన భర్త దోషములను కప్పును. ప్రేమతో సహించును. ప్రేమతో ఓర్చుకొనును. ప్రేమతో తాళుకొనును. తన జీవితాంతం నమ్మకస్థురాలై జీవించును. ప్రభువునకు వలె అన్ని విషయములలో తన భర్తకు లోబడును. సరియైన సాటియునైన గుణమును అలంకారము కలిగియుండును. భర్త చేసే మంచి పనులను పొగడ అన్ని సమయములలో భర్తను ఆదుకొని ఆదరించును. భర్తతో బిడ్డలతో కలిసి ప్రార్ధనలో కూర్చుండి ప్రభువుని స్తుతించును.

యెహోవాయందు భయభక్తులు కలిగిన స్త్రీ కొనియాడ బడును. ఆమె చేసే ప్రతి పనిని బట్టి దానికి ప్రతిఫలం పొందును. గవునుల యొద్ద ఆయె కొనియాడ బడును. అపరంజిని సంపాదించుట కంటె జ్ఞానము సంపాదించుట ఎంతో శ్రేష్టము. వెండిని సంపాదించుట కంటె తెలివిని సంపాదించుట ఎంతో మేలు అని ఎరిగి తన కుటుంబమును జ్ఞానముతో శ్రేష్టముగా కట్టుకొనుచు దేవుని మేలులను పొందును. జీవం కలిగిన దేవుని స్తుతిస్తూ తన గృహమును కాపాడుకొనును. స్త్రీలారా ప్రభువు ఇచ్చు జ్ఞానముతో మన గృహములను కట్టుకుందాము. దేవుడు మీకు సహాయము చేయునుగాక! ఆమెన్.

**23వ పేజీ తరువాయి....**

సేవకులు, కాపరులు ప్రవక్తలు, అపొస్తలులు, పెద్దలు, పరిచారకులు అను వారిని ఏర్పాటు చేసియున్నారు. ఇట్టి వర్గముల వారు ఎందరున్నారు. అందరి పని కూడా ఒక్కటే ర్పజలను దేవుని వైపునకు త్రిప్పుట, నరకపాత్రులు కాకుండా సువార్త ద్వారా వారిని రక్షణలోనికి నడిపించుట.

ఈ ప్రత్యేకమైన పని నిమిత్తమే యేసుప్రభువు వారు కూడా శరీరధారిగా ఈ లోకమునకు వచ్చియున్నారు. లూకా 19:10: "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు వచ్చెనని అతనితో చెప్పెను"

ప్రజలను రక్షించే దానికి యేసుప్రభువు వారు మూడున్నర సంవత్సరాలు సువార్త సేవ చేశారు. ఎన్నో ఆశ్చర్యకరమైన క్రియలు చేశారు. స్వస్థతలు చేశారు. బోధలో ఉపమానములు చెప్పారు. పరలోకము-నరకమును గూర్చి కూడా బోధించినారు. నీతిని దుర్నీతిని గూర్చి బోధించారు. చివరకు పాపుల కొరకై సిలువలో తన ప్రాణమే బలిగా యిచ్చారు.

ఆనాడు యేసుప్రభువు వారు ప్రారంభించి మధ్యలో ఆపిన ఈ సువార్త పరిచర్య రక్షణ ప్రణాళిను ప్రతి విశ్వాసి కూడా ముందుకు తీసుకుపోవలసిన బాధ్య కలిగిన వారైయున్నారు. అందుకే పౌలుగారు తిమోతికి చెబుతూ ''సమయము, అసమయము అనక సువార్తను ప్రకటించుము" అని చెప్పియున్నాడు.

1కొరింథీ.9:16: సువార్తను ప్రకటించవలసిన భారము నా మీద మోపబడి వున్నది. అయ్యో, సువార్త ప్రకటింప పోయిన నాకు శ్రమ.

9:21-22: ధర్మశాస్త్రము లేని వారికి ధర్మశాస్త్రము లేని వానివలేనుంటిని బలహీనులను సంపాదించుకొనుటకు బలహీనుడివలే నుంటిని, ఏ విధము చేతనైనను కొందరిని రక్షింపవలెనని అందరికి అన్ని విధముల వాడనై యున్నాను. పౌలుగారు కలిగియున్న ఈ సువార్త పరిచర్య భారము.

**(సశేషం)**

## బైబిల్ క్విజ్ - 20 జవాబులు

1. యదీద్యా (2సమూ. 12:25)
2. తామారు (13:1)
3. తెకోవ (14:1)
4. బెత్మెర్హాకుకు (15:17)
5. షిమీ (16:7)
6. అహీతోపెలు (17:23)
7. యోవాబు (18:14,15)
8. 80 సం॥లు (19:32,35)
9. షెబ (20:1)
10. సౌలును, అతని యింటివారినిబట్టి (21:1)
11. 2సమూయేలు 22:26
12. బెనాయా (23:20)
13. గాదు (24:11)
14. అబీషగు (1రాజులు 1:3)
15. 40 సం॥లు (2:11)
16. వివేకముగల హృదయము (3:9)
17. టాపాతు (4:11)
18. రెండు లక్షల తూముల (5:11)
19. 7 సం॥లు (6:38)
20. 13 సం॥లు (7:1)
21. సీయోను అను దావీదు పురములో నుండి (8:1)
22. 240 మణుగులు (9:14)
23. షెబ (10:1)
24. 700 మంది (11:3)
25. షెకెము (12:1)

గత నెల ప్రశ్నలకు జవాబులు వ్రాసిన వారు :

**పి. చిన్నారావు**

వినుకొండవారివీధి, బాప్టిస్టునగర్, విజయవాడ

సాక్ష్యము

# కులంలో నుండి వెలివేశారు

నాపేరు సింగిరి నాంచారమ్మ నాతల్లి పేరు కూడా నాంచారమ్మే. నాతండ్రి చినిగే వెంకటసుబ్బయ్య, మాది ఒంగోలుకు తూర్పున సముద్రపు ఒడ్డునున్న మోటుమాల గ్రామము. మేము రెడ్డికులస్తులము. మేము ఎనిమిది మంది సంతానము నలుగురు ఆడపిల్లలు. నేను ఆడపిల్లలలో పెద్దదానను. మా తల్లి దండ్రులు రెక్కల కష్టం మీద మమ్ములను బ్రతికించారు. మాయింట్లో అందరిలో నేను అతి దేవతా భక్తి కలదానను. మడికట్టుకొని విగ్రహపూజ చేసేదానను.

నాకు 10సంవత్సరముల వయస్సులో నామేనమామ సింగిరి సుబ్బారావు కిచ్చి వివాహము చేసారు. మేమెవరము బడికి వెళ్ళి చదువుకోలేదు.

కొంతకాలానికి నాకు నలుగురు పిల్లలు పుట్టారు. పెద్దమ్మాయిని నాతమ్ముడికిచ్చి పెండ్లి చేసాను. ఆరోజులలో మాయింటికి దగ్గరలో జాన్‌దేవిడ్ అనే పాస్టరుగారు ఆయన భార్య చిన్న పిల్లలకు బడి చేప్తూ ఉండేవారు. నాచిన్నపిల్లలు ఆబడికి వెళ్తుండేవారు.

జాన్‌దేవిడ్ గారు ఒక దినమున నన్ను పిలిచి అమ్మా నోరు లేని వాటికి ఎందుకు శ్రమపడి పూజలు చేస్తావు నిన్ను యేసు ప్రభువు ఎంతో ప్రేమించాడు. ఆయన ప్రార్ధనకి రా అన్నాడు. నాకు చాలాకోపం వచ్చింది. మాదేవుళ్ళు మాకున్నారు. వాళ్ళ దేవుళ్ళకి నేనెందుకు పూజచెయ్యాలి తక్కువ కులం దేవుడికి మ్రొక్కమంటాడేమిటి? అను కొన్నాను. ఆయన మాటలు నేను పట్టించుకోలేదు.

నా పెద్ద కుమార్తె 3 నెల గర్బిణి, నాయింట్లోనే అందరం కలసి ఉంటాము మాది ఉమ్మడి కుటుంబము. జాన్ దేవిడ్ గారు నన్ను మరలా పిలిచి – అమ్మా నీకొక గొప్ప శోదన రాబోతున్నది. అది నువ్వు తట్టుకోలేవు కనుక నువ్వు యేసుప్రభువును నమ్ముకో – ఆయన ప్రేమగల దేవుడు నీకొరకు నాకొరకు శిలువలో మరణించితిరిగి లేచినవాడు అన్నాడు. అయినా నేను ప్రార్ధనకి పోలేదు. ఆ తర్వాత ఆయన నాలుగుసార్లు చెప్పాడు. నేను లెక్కచెయ్యలేదు. నాకు నాలుగు బర్రెలు ఉన్నవి. వాటి చాకిరి చెయ్యాలి. బలహీనముగా ఉన్నాను. ఒకరోజు బర్రెలకు నీళ్ళు పెట్టి అక్కడే పడిపోయాను. అప్పుడు నాకుమార్తె జాన్‌దేవిడ్ గారికి చెప్పింది. ఆయన –ఆయన భార్య రక్షణకుమారి వచ్చి ప్రార్ధనచేసారు– అప్పుడు నాకు కొంచెం నెమ్మది కలిగింది. అప్పుడు నాపెద్దకుమార్తెతో కలసి ప్రార్ధనకు వెళ్ళాను ప్రార్ధనలో ఉన్నంత సేపు నాకు మనసు నెమ్మదిగా ఉన్నది. కాని ఇంటికి రాగానే నాలో నేను మాదేవతలకంటే యేసు గొప్పవాడా? చిన్నతనము నుండి – నేను అనాదిగా మా పితరులు కొలిసే దేవుళ్ళకి ఎన్నోమహిమలున్నాయి అని మళ్ళీ ప్రార్ధనకి వెళ్ళలేదు.

మా ఊరిలో తిరనాళ్ళ రోజులలో నేను నాభర్త కుమార్తెతో సాయంకాలం పూజచెయ్యటానికి రాములవారి గుడికి వెళ్ళి టెంకాయ కొట్టివచ్చాము. ఆరోజు శనివారం మరలా ఆదివారం అదేసమయానికి నాపెద్దకుమార్తె చనిపోయినది. ఆవూరిలో ఆదేవాలయం దగ్గర ఉండే దయ్యం చంపింది అని అందరు అన్నారు. ఇప్పటికి అలా 12 మంది చనిపోయారట.

తర్వాత ఒక సంవత్సరానికి మాఅమ్మ చనిపోయింది. వెంటనే నాకు జాన్‌దేవిడ్ గారు చెప్పిన శోధన గుర్తుకు

వచ్చింది. నేను ఇంతకాలం కొలిచిన నా దేవుళ్ళెవరు నాకు సహాయం చెయ్యలేదేమి? తర్వాత మా నాయన చని పోయాడు ఇల్లంతా బోసిపోయింది. నాకు అన్నం సయించలేదు. పనిపాట మానేసాను. ఒకరోజు నాభర్త నాఎదురుగా కూర్చుని – నువ్వు కూడా చచ్చిపోతావా? అని ఏడ్చాడు – అప్పుడు యేసు ప్రార్ధనకు వెళ్తాను అని అన్నాను – పిల్లల్ని కూడ తీసికొని వెళ్ళు అన్నాడు. ప్రార్ధనకు వెళ్ళాను. సంఘములో యేసు బిడ్డలందరు ఉపవాసం ఉండి నాకొరకు ప్రార్ధనచేసారు. తర్వాత నాభర్త కూడ ప్రార్ధనకి వచ్చాడు మనసులో, ఇంట్లో ప్రశాంతత ఏర్పడింది. మేమం దరము బాప్తిస్మము తీసికొన్నాము. నాపేరు లూదియమ్మగా మారింది. మా వూర్లోవాళ్ళు తిరనాళ్ళకి సిద్ధపడుతున్నారు. నన్ను చందా అడిగారు అయ్యానేను నాకుటుంబము యేసును నమ్ముకొని నెమ్మదిగా ఉన్నాము చందా ఇవ్వ నన్నాను. వారు అలా మూడు సంవత్సరాలు చందా అడిగారు నేను ఇవ్వలేదు. కనుక వారు మమ్మల్ని కులంలో నుండి వెలివేశారు. పనిలోకి పిలవలేదు మేము చాలా కష్టాల్లో ఉన్నాము. ఒకరోజు నాభర్తని కొట్టారు. మాల మాదిగల దేవుడ్ని కొలిచే వాళ్ళు మా మధ్యలో ఉండ వద్దన్నారు. మరలా సంవత్సరానికి నా భర్తని కొట్టారు. ఓర్చుకొన్నాము.

మూడవసారి టైరు బండి అడ్డంపెట్టి తలపగలగొట్టారు పోలీసు వారువచ్చి కొట్టిన వాళ్ళమీద కేసుపెట్టారు నాభర్తని గవర్నమెంటు ఆస్పత్రిలోచేర్పించారు. నేను సింగోతు అబ్రాహాము అనే పల్లెకారు క్రైస్తవుడైన విశ్వాసితోకలసి ఒంగోలులోని పెద్ద పెద్ద క్రైస్తవ నాయకుల వద్దకు వెళ్ళి మాకు మాట సహాయం చెయ్యమని అడిగాము కాని ఎవరూ మా సంగతి పట్టించుకోలేదు. మమ్మల్ని కొట్టిన వారు బలవంతులు రాజకీయ నాయకులను అడ్డుపెట్టుకొన్నారు. చివరికి రాజికుదిర్చారు. మా ఆయనకి పనిలేదు. ఒక మధ్యాహ్నం పంచలో పండుకొన్నాను కలలో ఎవరో వచ్చి – రేపటినుండి మీ ఆయన పనిలోకి వెళ్తాడు అని చెప్పాడు. మరునాడు – మనుష్యులు వచ్చి నాపెనిమిటిని పనికి పిలచారు. పాస్టరు గారికోరిక మేరకు నేను కుటుంబముతో కావలి దగ్గర తుమ్మలపెంటలో 2సంవత్సరములు సేవ చేసాను. తర్వాత మావూరు వచ్చాము. నాపెద్దకుమారుని ప్రభువు సేవకు అభిషేకించాము. చిన్నకుమారుడు డేవిడ్ పనికి వెళ్తున్నాడు. కుమార్తె 'గ్లోరి' ఏడు చదివించి ప్రతిరోజు మధ్యాహ్నం 2గంటలకు నేను ప్రార్ధనలో ఉంటాను. అనేకులు అనేక సమస్యలతో – వ్యాధులతో వస్తారు. వారి కొరకు ప్రార్ధిస్తుంటాను. ప్రభువు రాజ్యము కొరకు నేను జీవించునట్లు నాకొరకు ప్రార్ధించండి.

**ఇట్లు సింగిరి లూదియమ్మ**

## పాఠకులకు గమనిక

'పరిశుద్ధత' మాసపత్రిక ద్వారా మిమ్మును ఆధ్యాత్మికంగా బలపరచాలని ప్రతినెలా ఎంతో వ్యయప్రయాసలకోర్చి మీకు పంపిస్తున్నాము. పత్రిక కొరకు ప్రతి నెలా మేము దేవుని వైపు చూస్తున్నాము. అయితే పత్రిక మీ యొక్క ఆధ్యాత్మిక జీవితానికి ఎంతగా ఉపయోగ పడుతుందో, మీరు ఎలాంటి మేలులు పొందుతున్నారో మీ ద్వారా తెలిసుకోవాలని మేము ఎంతగానో ఆశిస్తున్నాము. కాబట్టి పత్రిక పొందుతున్న ప్రతి ఒక్కరూ మీ యొక్క స్పందన మాకు 'పోస్టుకార్డు' ద్వారా లేదా ఈ క్రింది ఫోన్ నంబర్లకు ఎస్.యం.ఎస్ ద్వారా తెలియజేయవలసినదిగా ప్రభువు నామమున మిమ్మును కోరుతున్నాము. **–ఎడిటర్**

**9440217726, 9493950969**

**కాబట్టి మీరు వెళ్ళి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. మత్తయి 28:19**

# HOLY BIBLE SCHOOL

6th Lane, Cloughpet, ONGOLE

# హోలి బైబిల్ స్కూల్

**ఆగష్టు 1వ తేది నుండి బైబిలు పాఠశాల ప్రారంభం**

అర్హత : 10వ తరగతి పాస్/ఫెయిల్

కాలపరిమితి : 6 నెలలు (3 నెలలు క్లాసులు, 3 నెలలు అవుట్‌రీచ్)

మొత్తము 15 మంది విద్యార్థులకు (స్త్రీ/పు) మాత్రమే

**ఉచిత శిక్షణ. మా దగ్గరే ఉండుటకు అవకాశము కలదు.**

**బయట నుండి కూడా రావచ్చును. వసతి మరియు భోజనము ఉచితము**

ఉత్తమమైన బైబిల్ శిక్షణ మరియు అనుభవజ్ఞులైన బైబిల్ టీచర్స్‌తో క్లాసులు జరుపబడును. అమెరికా దేశము నుండి బైబిల్ టీచర్స్ మరియు స్వదేశీ బైబిల్ పండితులచే ప్రతిరోజూ పాఠములు బోధింపబడును గనుక ఆసక్తిగలవారు ఈ అవకాశమును వినియోగించుకొనవలెను.

మరిన్ని వివరములకు సంప్రదించండి :

**రెవ. కె. సామ్రాట్**
**ప్రిన్సిపాల్/సెక్రటరీ**
**హోలీ బైబిల్ స్కూల్**
**6వ లైను, క్లౌపేట**
**ఒంగోలు-523001**
**సెల్ : 9542417771**

**రెవ.డా॥ కె.జోసఫ్**
**ఫౌండర్/ప్రెసిడెంట్**
**ఐ.ఈ.ఆర్.ఎఫ్**
**6వ లైను, క్లౌపేట**
**ఒంగోలు-523001**
**సెల్ : 9704255416**

INDIA EVANGELISTIC & RELIEF FELLOWSHIP
ONGOLE

# పరలోకము అనగానేమి?

కొలస్స. 1:28. ప్రతి మనుష్యునికి క్రీస్తునందు సంపూర్ణుని చేసి ఆయన ఎదుట నిలువబెట్ట వలెనని సమస్త విధములైన జ్ఞానముతోను ప్రతిమనుష్యునికి బుద్ధి చెప్పుచు ప్రతి మనుష్యునికి బోధించుచూ ఆయనను ప్రకటించు చున్నాము. 1. థెస్స. 2:4-12 వరకు గల భాగముతో పౌలుగారు సేవా విధానమును తెలుపుతున్నారు అందలి అంశములు ధ్యానించుము 1. మనుష్యులను సంతోష పెట్టు వాడుగాకాక దేవుని సంతోషపెట్టు వానిగా ఆయన సేవ చేసి యున్నారు 2. ఇచ్చకపు మాటలు ధనాపేక్షకు ఎక్కడ స్థానము యివ్వలేదు. 3. అపొస్తలుల అధికారమును ఎప్పుడు ప్రదర్శించక స్తన్యమిచ్చు తల్లి తన సొంత బిడ్డలను గౌరవించినట్టు బహు సాధువుగా వారి మధ్య పరిచర్య చేశారు. 4. ఎవ్వరికి భారముగా నుండకుండ నిమిత్తము వారి అక్కరల కొరకు శ్రమపడి పని చేసి ఉన్నారు. సేవ చేయుటకు కావలసిన మెలుకవలన్నియు పౌలుగారి సేవా జీవితములో నుండి కోకొల్లలుగా నేర్చుకొనవచ్చును అక్షరార్ధముగా ఎన్ని మెలుకువలు మనము నేర్చి యున్నాము. పరిశుద్ధాత్మ సహాయము లేకుండా ఏ సేవకుడును ఫలభరితమైన సేవకు చేయలేడు. పౌలుగారు యింత కష్టనష్టములను ఓర్చినారు కాబట్టి అనేక సంఘాలు కట్టగలిగినారు అనేక మందిని శిష్యులుగా మార్చగల్గినారు. శిష్యులను సేవకు పంపునప్పుడు యేసుప్రభువువారు వారికి కొన్ని అధికారములను కూడ ఇచ్చియున్నారు.

మత్త. 10:1. ఆయన తన పండ్రెండు మంది శిష్యులను పిలచి అపవిత్రాత్మలను వెల్ల గొట్టుటకును ప్రతి విధములైన రోగమును వ్యాధిని స్వస్థపరచుటకును వారికి అధికార మిచ్చెను. 10:16 పాములవలె వివేకులును పావురముల వలె నిష్కపటులునై యుండుడి అని హెచ్చరించిరి. పాపములను క్షమించుటకు భూమి మీద మనుష్య కుమారునికి అధికారము కలదు అని చెప్పెను ప్రభువు తన శిష్యులకు కూడ అట్టి అధికారమును అనుగ్రహించి నట్టుగా చూడగలము. యోహా. 20:23 మీరు ఎవరి పాపములు క్షమింతురో అని వారికి క్షమింపబడును ఎవరి పాపములు మీరు నిలిచి యుండనిత్తురో అవి నిలిచి యుండునని వారితో చెప్పును. అ.కార్య 1:8 అయినను పరిశుద్ధాత్మ మా మీదికి వచ్చునప్పుడు మీరు శక్తి నొందెదరు గనుక మీరు యొరూషలేములోను యూదయ సమర దేశము అంతటను భూదిగంతములవరకు నాకు సాక్షులై యుందురని వారితో చెప్పెను. శిష్యులు ఈ అధికారమును వినియోగించుకొని అనేక అద్భుతములు చేసి చూపిరి ఆత్మ సారధ్యములో బోధింపగా 12 మందితో ప్రారంభింపబడిన ఈ దేవుని సువార్త సేవ ఇప్పుడు భూమిలో నీలు చెరుగుల వ్యాపించి అనేక లక్షల కోట్ల మందిని పాపము నుండి మరణము నుండి విడిపించి దేవుని నమ్మకమైన సేవకులుగా శిష్యులుగా మార్చ గలిగినిది.

**2వ అధికారము బాప్తిస్మమిచ్చుట:-** నేటి దినములలో రకరకాల బాప్తిస్మములు సంఘములలో చోటు చేసుకున్నది. అయితే ఆది అపోస్తలులు తండ్రి యొక్కయు కుమారులు యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములో దేవుని విశ్వసించిన వారికి బాప్తిస్మమిచ్చునట్టు అదియు ముంచ డము అనగా నీటిలో సంపూర్ణముగాచూచి మనిషిని ఆ పైకి తీయు ప్రక్రియ. క్రీస్తు మృతిచెంది పాతిపెట్టబడి పున రుద్ధానుడై తిరిగి లేచి యున్నారు అనేదానికి సాదృశ్యముగా పాపముల నిమిత్తము నీటిలో సమాధి చేయబడి క్రీస్తు నిమిత్తము సజీవుడై నీటిలో నుండి వెలుపలకు వచ్చుట దీని అసలు భావము కాగా ఈ దినములలో బాప్తిస్మము

యొక్క రూపురేఖలు విలువలు మారినట్టుగా సంఘాలలో మనము చూస్తున్నాము.

3) **మూడవ అంశము- యేసుప్రభువు నేర్పిన అంశములను బోధించుట:-** యేసుక్రీస్తు వారు మూడున్నర సంవత్సరాలు కాలము విస్తారమైన సువార్త సేవచేసి యున్నాను శిష్యులు ఆయన వెంట వుండి అనేక విషయాలు నేర్చుకున్నారు. వాటినన్నింటిని తిరిగి నేర్పించుట మారుమనస్సు రక్షణ బాప్తిస్మము విశ్వాసము పరిశుద్ధత కాపాడుకొనుట పాపమునకు దూరముగానుండుట మొదలగు అనేక విషయములు యేసు ప్రభువువారు శిష్యులకు నేర్పియున్నాను అవి అన్నియు తిరిగి వారు నేర్పించు లాగున ఆజ్ఞ ఇచ్చినారు. ఇన్ని అధికారములు ఆజ్ఞలు సలహాలు ఇచ్చిన దేవుడు వారిని విడిచిపెట్టి వెల్ల లేదు ప్రభువు అక్కడ వారితో చెప్పారు. "ఇదిగో నేను ఎప్పటికని యుగాంతము వరకు మీతో కూడ ఉన్నాను" అన్నారు. ఉంటాను అనలేదు ఉన్నాను అంటే నాడు నేడు కూడ ప్రభువు శిష్యులతో వున్నట్టుగానే భావించవలసిన వారమైయున్నాము యేసు ప్రభువు వారిపై "ఇమ్మానియేలు" అను మరో పేరు కూడ కలదు ఇమ్మానియేలు అనుపదమునకు దేవుడు మనకు తోడు అని అర్థము వున్నది కాబట్టి సర్వకాలము సర్వావస్థలో దేవుడు మనకు తోడుగా వుంటాడని నమ్మవలసి వుంది.

**3) శిష్యుల కుండవలసిన గుణ లక్షణములు:-**

1. మత్త.16:24.ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల తననుతాను ఉపేక్షించుకొని తన సిలువ నెత్తుకొని నన్నువెంబడింపవలెను. శిష్యుడుగా నుండ గోరిన వ్యక్తి మొదటిగా తనను తాను మార్పు చేసుకొనుటకు ధృడ నిశ్చయము కలిగి వుండాలి. యేసు ప్రభువు వారు కూడ తన్ను తాను రిక్తునిగా చేసికొని మానవ శరీరము ధరించారు. దాసునిగా వచ్చినాడు. ఈ విషయము ప్రతి శిష్యుడు గమనించవలసి వుంది. అటు తరువాత తన సిలువ తానే ఎత్తుకోవాలి. అనగా ధన వ్యామోహము లేనివాడైయుండి తన అవసరతలన్నియు తానే తీర్చుకోగలిగి వుండాలి. ఆకలి, వస్త్రహీనత, నిందలు, కరువులు, వ్యతిరేకతలు సమస్తము భరించగలిగినవాడై యుండాలి.

2. లూకా 14:26:- "ఎవడైనను నా యొద్దకు వచ్చి తన తండ్రిని తల్లిని, భార్యను పిల్లలను అన్నదమ్ములు అక్క చెల్లెండ్రను తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే నాకు శిష్యుడు కానేరడు".

ఈ వాక్యము ఆది.13లో అబ్రాహాము యొక్క పిలుపును జ్ఞాపకము చేయుచున్నది. అబ్రాహాము ఎలాగైతే ఊరును, బంధవులను, తండ్రిని అన్నింటిని వదలి బయలు దేరినాడో అలాగే శిష్యుడుగా నుండగోరిన వాడు అందరిని వదులుకోవాలి. అంత మాత్రమే కాదు తన ప్రాణమును సహితము దేవుని కొరకు వెచ్చించగల త్యాగశీలుడై వుండాలి.

3) లూకా 14:33: ఒకడు తనకు కలిగిన దంతయు విడిచిపెట్టని వాడు నాకు శిష్యుడు కానేరడు. వెనుక జీవితములో తనకు కలిగినవన్ని అనగా డబ్బుకావచ్చు, అలవాట్లు కావచ్చు, స్నేహాలు కావచ్చు, అధికారము కూడా కావచ్చు. వాటినన్నింటిని విడిచేవాడే శిష్యుడుగా నుండ గలడు.

4) యోహాను 8:31: నా వాక్యమందు నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులైయుండి సత్యమును గ్రహింతురు. నాయందు మీరు నిలిచియుండుడి, నేను మీయందు నిలిచి యుందును అని ప్రభువు చెప్పినట్లుగా, నా వాక్యమందు నిలిచియుండుడి, నాకు శిష్యులైయుందురు. అప్పుడు సత్యము తెలుస్తుంది. ఆ సత్యము మిమ్ములను సర్వ స్వతంత్రులనుగా చేస్తుంది. వాక్యమందు నిలిచి వుండేవాడే శిష్యుడు.

యేసుక్రీస్తు వారు ఇవి అన్నియు చెప్పుటకు ప్రధాన కారణము పాపులు రక్షించబడాలి. ఎవరూ దేవునికి దూరముగా నుండరాదు. ఎవరూ అపవాదిని అనుసరించి నరకమునకు పాత్రులు కారాదు. ప్రజలను రక్షణ మార్గములో నడిపించే దానికే సువార్త సేవలో శిష్యులు,

**...మిగతా 18వ పేజిలో**



# అక్షరయజ్ఞం



**శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్**

## బైబిల్ క్విజ్ - 21

1రాజులు 13 నుండి 2రాజులు15 వరకు

1. దేవుని మాటకు వ్యతిరేకముగా చేసిన ప్రవక్తను చంపినది ఏమిటి? (1రాజులు 13)
2. యరొబాము ఎన్ని సంవత్సరములు ఇశ్రాయేలీయును పరిపాలించెను?
3. ఆసా అవ్వ పేరు ఏమిటి?
4. అహాబు తండ్రి పేరు ఏమిటి?
5. వర్షము లేక వాగులో నీరు ఎండిపోయిన తరువాత ఎక్కడికి వెళ్ళమని యెహోవా ఏలియాకు చెప్పెను?
6. అహాబు గృహనిర్వాహకుని పేరు ఏమిటి?
7. దేవుని పర్వతము పేరు ఏమిటి?
8. బెన్హదదుకు సహకారులైన రాజులు ఎంతమంది?
9. అహాబు ఎవరి ద్రాక్షాతోట కావాలని కోరుకొనెను?
10. మీకాయ ప్రవక్తను చెంపమీద కొట్టిన సిద్కియా తండ్రి పేరు ఏమిటి?
11. అహజ్యా తరువాత రాజైనది ఎవరు? (2రాజులు)
12. ఎలీషా యొక్క శాపము వలన ఎంతమంది బాలురు చనిపోయిరి?
13. ఇశ్రాయేలీయులు మోయాబీయుల ఏ పట్టణమును నాశనము చేయక విడిచిపెట్టిరి?
14. ఏ పట్టణములోని స్త్రీ ఎలీషా కొరకు ఒక గది కట్టించెను?
15. సిరియా దేశపు సైన్యాధిపతియైన నయమానుకు ఉన్న రోగము ఏమిటి?
16. షోమ్రోనులో కరువు వచ్చినప్పుడు గాడిద తల ఎంతకు అమ్మబడెను?
17. సిరియనుల దండుపేటలోనికి ఎంతమంది కుష్ఠరోగులు వెళ్ళెను?
18. ఎవరిని చూచి ఎలీషా ప్రవక్త కన్నీళ్లు రాల్చెను?
19. యెహూ తండ్రి పేరు ఏమిటి?
20. యెహోనాదాబు తండ్రి పేరు ఏమిటి?
21. అతల్యా దేశమును ఎన్ని సంవత్సరములు ఏలెను?
22. యోవాషు తల్లి పేరు ఏమిటి?
23. మరణకరమైన రోగముతో పీడితుడైన ప్రవక్త ఎవరు?
24. ప్రవక్తయైన యోనా ఏ ఊరి వాడు?
25. అష్షూరు రాజు పేరు ఏమిటి?

మీ జవాబులను పోస్టుకార్డు లేదా ఎన్వలప్ కవరు ద్వారా ఈ నెల 30వ తేది లోపు **పరిశుద్ధత-బైబిల్ క్విజ్, పోస్ట్‌బాక్స్ నెం.28, ఒంగోలు-523001** అడ్రసుకు పంపగలరు.

అన్ని ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాసిన వారికి

**పరలోకము-నరకము**

అను పుస్తకము ఉచితముగా పంపబడును

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం. కావున ప్రతి ఒక్కరూ ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొని బైబిలు జ్ఞానము సంపాదించటంతో పాటు బహుమతులు గెలుపొందవలసినదిగా కోరుచున్నాము.